


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 208 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 4 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :208 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 4 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు

# 'పట్టా'భిషేకం

- పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు
- గోవిందు అనే వ్యక్తి కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్
- ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని వెల్లడి
- మంగళగిరిని టీడీపీ కంచుకోటగా మార్చుతానని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు.
ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.
2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని

వివరాలు 2లో..

## పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉంది

### పరిటాల సునీత సంచలన ఆరోపణలు

- మీడియా సమావేశం నిర్వహించిన టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల రవి హత్య కేసులో సీబీఐ జగన్ ను కూడా విచారించిందని వెల్లడి
- ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఫ్యాక్షన్ చిచ్చుపెట్టొద్దని హితవు



పెన్ పవర్ డెస్క్:రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇవాళ మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉందని అన్నారు. పరిటాల రవి హత్య కేసులో సీబీఐ జగన్ ను కూడా విచారించిందని గుర్తు చేశారు. టీవీ బాంబు

వివరాలు 2లో..

## విచారణకు డుమ్మా కొట్టిన కాకాణి గోవర్ధన్

- అక్రమ మైనింగ్ కేసులో పోలీసు విచారణకు కాకాణి డుమ్మా
- ఇప్పటికి మూడు సార్లు నోటీసులు జారీ చేసిన పోలీసులు
- పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారిన వైనం



పెన్ పవర్ డెస్క్:క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈరోజు కూడా పోలీసు విచారణకు డుమ్మా కొట్టారు. ఈ కేసులో ఇప్పటి వరకు మూడు సార్లు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయనకు నోటీసులు ఇవ్వడానికి పోలీసులు వెళ్లిన ప్రతిసారీ కాకాణి వారికి కనిపించలేదు. ఇప్పుడు మూడోసారి కూడా విచారణకు ఆయన డుమ్మా కొట్టడంతో...

వివరాలు 2లో..

## మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు



- వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని కేసు
- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్ రెడ్డి
- మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు

పెన్ పవర్ డెస్క్:వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టు షాకిచ్చింది. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని గత ఏడాది సెప్టెంబర్ 23న సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తన పేరు చేర్చి అరెస్ట్ చేస్తారేమో అనే అనుమానంతో హైకోర్టును

వివరాలు 2లో..

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

- లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- వక్ఫ్ సవరణ బిల్లుపై తన వైఖరి వెల్లడించిన టీవీకే పార్టీ
- బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:తమిళ సూపర్ స్టార్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రేపు తమిళనాడు వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. సుదీర్ఘ చర్చల అనంతరం లోక్‌సభలో ఆమోదం పొందిన

## హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలు...

### స్పందించిన రఘునందన్ రావు

- విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందన్న రఘునందన్ రావు
- విద్యార్థుల పోరాటం ఫలితంగానే కోర్టు ఆదేశాలు వచ్చాయన్న బీజేపీ ఎంపీ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నడుచుకోవాలని సూచన

వివరాలు 2లో..



## థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

- థాయ్‌లాండ్ లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- థాయ్ ప్రధాని షినవత్రాతో ద్వైపాక్షిక సమావేశం
- ఈ సందర్భంగా మోదీకి తిపిటక గ్రంథం బహూకరణ



పెన్ పవర్ డెస్క్:భారత ప్రధాని నరేంద్ర మోదీకి థాయ్‌లాండ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా విశిష్ట కానుకను అందజేశారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా 'ది వరల్డ్ తిపిటక: సజ్ఝాయ ఫొనెటిక్ ఎడిషన్' పేరు గల బౌద్ధ గ్రంథాన్ని మోదీకి బహుకరించారు. ఈ చర్య భారత్, థాయ్‌లాండ్ మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన, మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

వివరాలు 2లో..

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు ఏవోకు మెయిల్ ద్వారా బెదిరింపు
- పోలీసులకు సమాచారం అందించిన అధికారులు
- అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదన్న పోలీసులు




పెన్ పవర్ డెస్క్:మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. కలెక్టరేట్ లో బాంబు పెట్టినట్లు ఏవోకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు అందాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం

వివరాలు 2లో..

## ట్రంప్ సుంకాలు భారత్ ఆర్థిక వ్యవస్థను నాశనం

- ట్రంప్ విధించిన సుంకాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి: రాహుల్ గాంధీ
- అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్న రాహుల్ గాంధీ
- కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన అనురాగ్ ఠాకూర్



వివరాలు 2లో..

## సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

- వివేకా హత్య కేసులోని నిందితులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారన్న షర్మిల
- అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని వ్యాఖ్య
- హత్య జరిగినప్పుడు అక్కడ అవినాశ్ రెడ్డి ఉన్నారన్న షర్మిల




పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి బెయిల్ పై బయట ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని అన్నారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు




- భారత్ ఏఐకి త్వరగా అలవాటు పడిందన్న శామ్ ఆల్ట్‌మన్
- భారతీయుల క్రియేటివిటీపైనా ప్రశంసలు
- ఏపీలో ఏఐ అభివృద్ధికి గల అవకాశాలను అన్వేషించాలన్న చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిగ్గజ సంస్థ ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను అమరావతికి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా కోరారు. భారతదేశం ఏఐకి త్వరగా అలవాటుపడిందని, భారతీయుల సృజనాత్మకత అద్భుతమని ఆల్ట్‌మన్ చేసిన ట్వీట్ కు చంద్రబాబు స్పందించారు. ఈ మేరకు ఆయనను ఏపీకి ఆహ్వానించారు. ఏఐలో భారత్ దూసుకుపోతోందని

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

## ట్రంప్ అన్నంత పనిచేశారుగా...

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ వంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని పలు సందర్భాల్లో హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు. అమెరికా దేశ భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని మరోసారి నొక్కి చెప్పారు.భారత్ సహా ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నాని, ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు ట్రంప్ తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ఇక తాము 26 శాతం మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ప్రస్తావిస్తూ మోదీ తనకు గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదన్నారు. అమెరికాపై 52 శాతం మేర సుంకాలు విధిస్తోందని మరోసారి గుర్తు చేశారు. మరోవైపు.. చైనాపై 34 శాతం మేర సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం సుంకాలు ఉంటాయని ప్రకటించారు.ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఫార్మా, వ్యవసాయం, రసాయనాలు, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్, మెషినరీ వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. వియత్నాం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏకంగా 46 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు ట్రంప్. స్విట్జర్లాండ్‌పై 31 శాతం, తైవాన్ పై 32 శాతం, బ్రిటన్ పై 10 శాతం, బ్రెజిల్ పై 10 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, సింగపూర్‌పై 10 శాతం, దక్షిణాఫ్రికాపై 30 శాతం మేర ప్రతీకార సుంకాలు ప్రకటించారు.భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది కూడా దాదాపు 18 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ఈ సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ఈ దిగుమతుల ధరలు పెరిగి, అమెరికా మార్కెట్‌లో వాటి పోటీదనాన్ని తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ క్రింది రంగాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించవచ్చు.భారతదేశం ప్రపంచానికి ప్రధానంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా ఉంది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఔషధ కంపెనీలు గొప్ప స్థాయిలో పోటీ చేస్తున్నాయి. అయితే 26% సుంకం వల్ల ఈ ఉత్పత్తుల ఖర్చులు పెరిగి, వాటి ధరలు ఎక్కువయ్యే అవకాశముంది. ఫలితంగా, అమెరికాలో భారత ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చు.భారతదేశం అమెరికాకు భారీగా వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. భారతీయ కాటన్, రేష్మి, ఇతర వస్త్ర ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే, సుంకాల కారణంగా ధరలు పెరిగితే, ఇతర దేశాల పోటీ పెరిగి, భారత వస్త్ర వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు పెద్ద మొత్తంలో ఆటో విడిభాగాలను ఎగుమతి చేస్తోంది. ఈ కొత్త సుంకాలు భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రభావితం చేసి, అమెరికాలో భారతీయ ఆటో భాగాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల భారతదేశ ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు పెట్రోలియం ఉత్పత్తులు, రసాయన పదార్థాలు కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈ సుంకాల వల్ల, ఈ ఉత్పత్తులపై ఖర్చు పెరిగి, వాటి ఎగుమతికి ఆటంకం కలిగే అవకాశం ఉంది,భారతదేశం నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటీ సంబంధిత హార్డ్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే చైనా వంటి దేశాలతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పుడు సుంకాల కారణంగా, భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పోటీదనం మరింత తగ్గే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది ఎగుమతి అయ్యే ఉత్పత్తులు గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 17-18% ఉంటుంది.అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 17-18% వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు. ఈ ఉత్పత్తుల్లో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటాయి. దీంతో అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. ఆ తర్వాత యూఏఈ, చైనా వంటి దేశాలు ఉన్నాయి.ఇక భారతదేశం విదేశాల నుంచి దిగుమతులు చేసుకునే వస్తువుల్లో అమెరికా కీలకమైన భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారత్ మొత్తం దిగుమతుల విలువ సుమారు 732 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా నుంచి దిగుమతులు 42.12 బిలియన్ డాలర్లు, అంటే సుమారు 5.75%. అంటే, ప్రతి ఏడాది భారత్ దిగుమతులలో అమెరికా వాటా సుమారు 5-6%గా ఉంటుందిభారతదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ప్రధాన వస్తువులలో క్రూడ్ పెట్రోలియం (ముడి చమురు), బొగ్గు ఉత్పత్తులు (కోల్ బ్రికెట్స్) ,గ్యాస్ టర్బైన్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అమెరికా భారత్‌కు ముఖ్యమైన వ్యాపార భాగస్వామిగా ఉన్నప్పటికీ, చైనా (17%), రష్యా (9%) పెద్ద వాటా కలిగి ఉండటం విశేషం. అయినప్పటికీ, అమెరికా నుంచి వచ్చే టెక్నాలజీ ఉత్పత్తులు, ఖరీదైన రత్నాలు, ఇంధన వనరులు భారత మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

# పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉంది

- మొదటి పేజీ తరువాయి

గురించి మాట్లాడుతున్న వారు కారు బాంబు గురించి కూడా మాట్లాడాలని వ్యాఖ్యానించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 45 మందిని హత్యకు గురయ్యారని ఆరోపించారు. రాప్తాడులో తోపుదుర్తి సోదరులు ముఠా కక్షలను రెచ్చగొడుతున్నారని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబుల్ రెడ్డి, మద్దెలచెరువు సూరి కుటుంబాలను ఫ్యాక్షనిజంలోకి లాగుతున్నారని విమర్శించారు. "తోపుదుర్తి సోదరుల మాటలు నమ్మి ఈ కుట్రలో భాగస్వామ్యం కావొద్దని కనుముక్కల ఉమ, గంగుల భానుమతికి విజ్ఞప్తి చేస్తున్నా... ఇప్పటికే మన మూడు కుటుంబాలు ఫ్యాక్షన్ కారణంగా చాలా నష్టపోయాయి. మనం కోలుకోవడానికి చాలా సమయం పట్టింది... ఇప్పుడు మళ్లీ తోపుదుర్తి సోదరులు ఫ్యాక్షన్ ఉచ్చులోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారు. తోపుదుర్తి సోదరులు ఏం చెప్పినా జగన్ నమ్మేస్తున్నారు... ఐదేళ్లు సీఎంగా పనిచేసిన మీరు నిజానిజాలు తెలుసుకోరా? జగన్ శుక్రవారం నాడు పాపిరెడ్డిపల్లి గ్రామానికి వస్తానంటున్నారు... ఆయనకు శుక్రవారం కలిసొచ్చిందేమో! వచ్చేటప్పుడు జగన్ తన సూట్ కేసులో కాస్త దుస్తులు ఎక్కువగా తెచ్చుకుంటే బాగుంటుంది... లింగమయ్య కుటుంబాన్నే కాదు, మీ పార్టీ వల్ల నష్టపోయిన వారి కుటుంబాలను కూడా పరామర్శించాలి కదా! ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఫ్యాక్షన్ చిచ్చు పెట్టవద్దని జగన్ కు స్పష్టం చేస్తున్నా" అంటూ పరిటాల సునీత పేర్కొన్నారు.

## మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు

- మొదటి పేజీ తరువాయి

మిథున్ రెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై మార్చి 24న హైకోర్టులో వాదనలు జరిగాయి. తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు... మార్చి 3న తీర్పును వెలువరిస్తామని... అప్పటి వరకు మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. ఈరోజు మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. వాదనల సందర్భంగా సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ... ఈ కేసులో మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, ఆయనకు నోటీసులు ఇవ్వలేదని, విచారణకు హాజరు కావాలని ఆదేశించలేదని కోర్టుకు తెలిపారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేనప్పుడు బెయిల్ కోరడానికి వీల్లేదని చెప్పారు.

## ట్రంప్ సుంకాలు భారత్ ఆర్థిక వ్యవస్థను నాశనం

**పెన్ పవర్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, అమెరికా సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోబోతుందో స్పష్టం చేయాలన ఆయన కోరారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ భారత్-చైనా సరిహద్దు వివాదాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చైనా మన దేశానికి చెందిన 4 వేల కిలోమీటర్లకు పైగా భూభాగాన్ని ఆక్రమించిందని, దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసిందని ఆయన అన్నారు. ఆక్రమిత భూభాగాన్ని త్వరగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం అక్కడి రాయబారి ద్వారా వెలుగులోకి వచ్చిందని తెలిపారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు

బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ప్రతిస్పందించారు. ఏ ప్రభుత్వ హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసని అన్నారు. డోక్లాం ఘటన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి ఎవరు సూప్ తాగారో కూడా తెలుసని ఠాకూర్ విమర్శించారు. ఇలాంటి అంశాలను రాజకీయం చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని, గతంలో జరిగిన తప్పిదాలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని నిలదీశారు.

## సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

- మొదటి పేజీ తరువాయి

వివేకా కూతురు సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని షర్మిల అన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం తమలో ఉందని చెప్పారు. ఇటీవల తనకు కొన్ని విషయాలు తెలిశాయని... అవి తనను ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. సునీతకు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో పలు విషయాలను పేర్కొందని షర్మిల తెలిపారు. విచారణ అధికారులను అవినాశ్ పిలిపించుకుని బెదిరించినట్టు అఫిడవిట్ లో ఉందని... తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాశ్ సంతకాలు చేయించినట్టు ఉందని చెప్పారు. అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని అన్నారు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించినట్టు తప్పుడు రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హత్య జరిగినప్పుడు ఘటనాస్థలిలో ఉన్నది అవవినాశ్ రెడ్డేనని చెప్పారు.

## థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

- మొదటి పేజీ తరువాయి

'తిపిటక' అంటే పాలీ భాషలో 'మూడు బుట్టలు'. ఇది బౌద్ధ ధర్మ గ్రంథాలలో ప్రధానమైనది. ఇందులో బౌద్ధ సన్యాసుల నియమాలు, సూత్రాలు, బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈ గ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది.

థాయ్ ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్ (రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో 'వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్'లో భాగంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ లిపులలో రూపొందించబడిన ఈ గ్రంథం, తొమ్మిది మిలియన్లకు పైగా పదాలను కలిగి ఉంది. అంతేకాకుండా, ఇది కచ్చితమైన ఉచ్ఛారణతో పఠించేందుకు వీలుగా రూపొందించబడింది. కానుక అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ, "ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారు. లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారతదేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించాను. గత సంవత్సరం, భారతదేశం లార్డ్ బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధాన మతగురువులను థాయ్‌లాండ్‌కు పంపింది. దాదాపు నాలుగు మిలియన్ల మంది ప్రజలు ఆ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

థాయ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, థాయ్‌లాండ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా ఉండటంతో పాటు, తిపిటకను ఇతర దేశాలకు వ్యాప్తి చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

## విచారణకు డుమ్మా కొట్టిన కాకాణి గోవర్ధన్

- మొదటి పేజీ తరువాయి

పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. గతంలో కూడా ఓ కేసులో ఇలాగే తప్పించుకు తిరిగినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న కాకాణి... చివరకు సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.

## హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలు...

**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వులపై బీజేపీ నేత, మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు స్పందించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల విషయంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే ఈ కోర్టు ఆదేశాలు వెలువడ్డాయని రఘునందన్ రావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ భూముల పరిరక్షణ కోసం తాము సైతం పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఒక్క చెట్టును కొట్టివేయలన్నా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, అలాంటిది వందల సంఖ్యలో చెట్లను కొట్టివేస్తే ఎలా? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. తమను ఎవరూ ఏమీ చేయలేరని భావించిన ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు చెంపదెబ్బలాంటివని అభివర్ణించారు.

## ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

శామ్ ఆల్ట్ మన్ చేసిన వ్యాఖ్యల పట్ల చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏఐ అభివృద్ధికి కేంద్రంగా మార్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. "మీరు చెప్పింది అక్షరాలా నిజం! భారతదేశం తన ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ ఆధారిత అభివృద్ధికి కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉంది. మీ తదుపరి భారత పర్యటనలో మిమ్మల్ని అమరావతికి ఆహ్వానించడం నాకు సంతోషంగా ఉంది. భవిష్యత్తును రూపొందించడంలో మా విజన్‌ను మీతో పంచుకుంటాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

రాష్ట్రం ఏఐతో పాటు క్వాంటం టెక్నాలజీలో కూడా ముందంజలో ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని, ఓపెన్ ఏఐతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉందని తెలిపారు.

## ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు 'పట్టా'భిషేకం

- మొదటి పేజీ తరువాయి

ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

- మొదటి పేజీ తరువాయి

ఈ వివాదాస్పద బిల్లుపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో టీవీకే పార్టీ కూడా తన వైఖరి వెల్లడించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టేందుకు టీవీకే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా నిరసనలను సమర్థవంతంగా నిర్వహించాలని అధినేత విజయ్ తన పార్టీ జిల్లా కార్యదర్శులకు సూచించారు.వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. లోక్‌సభలో బిల్లుకు అనుకూలంగా 288 మంది సభ్యులు ఓటు వేయగా, 232 మంది వ్యతిరేకించారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ, ప్రతిపాదించిన సవరణలన్నీ వాయిస్ ఓటు ద్వారా తిరస్కరించబడ్డాయి. ఎన్డీయే ఈ బిల్లు మైనారిటీ వర్గాలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రూపొందించామని సమర్థించుకుంది. అయితే ప్రతిపక్ష పార్టీలు దీనిని 'ముస్లిం వ్యతిరేకం' అని విమర్శించాయి. ప్రభుత్వం లౌకిక విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించాయి.భారతదేశంలో మైనారిటీలు మెరుగైన రక్షణ లభిస్తోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వాదించారు. "ప్రపంచంలో భారతదేశం కంటే సురక్షితమైన ప్రదేశం మైనారిటీలకు మరొకటి లేదు. భారతదేశంలో మెజారిటీ ప్రజలు పూర్తిగా లౌకికవాదులు కాబట్టి, మైనారిటీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ పొందుతున్నారు" అని మంత్రి రిజిజు చర్చ సందర్భంగా అన్నారు.

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- మొదటి పేజీ తరువాయి

అందించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో కలెక్టరేట్ ఆవరణలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మరోవైపు, బెదిరింపులు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# సుఖ వ్యాధులపై మొబైల్ క్యాంపు



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,ఏప్రిల్ 3 :**ఎవరైనా అనారోగ్య నీకి గురి అయితే వెంటనే డాక్టర్లను సంప్రదించి అనారోగ్యానికి అయినా కారణాలను తెలుసుకోవాలని మొబైల్ క్యాంపు మేనేజర్ యమ్ స్వాతి సూచించారు. గురువారం జీలుగుమిల్లిలో రామన్నపాలెం ,అంబేద్కర్ సెంటర్ ప్రాంతాలలో మొబైల్ క్యాంపు నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా టిబి, ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ ఎం నాగేశ్వరావు ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్ల ఆమె తెలిపారు. ఉచితంగా పరీక్షలు చేసి రిపోర్టులతో పాటు మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ మొబైల్ క్యాంపు ద్వారా సుమారు 72 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మొబై,ల్ కౌన్సిలర్ కె.ఆర్ సురేష్ ఎల్టి హేమంత్, ఏఎన్ఎం సుబ్బలక్ష్మి ,సిబ్బంది పాల్గొన్నారు.

# పెంటపల్లి గ్రామంలో రోడ్లపైనే మురుగునీరు



**గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 03 :** గ్రామపంచాయతీలలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ అన్ని విధాలుగా సహకరిస్తున్నా కొన్ని పంచాయతీలు వాటిని అందిపుచ్చుకుని తమ గ్రామాలను అభివృద్ధి పరచుకోవడంలో విఫలమవుతున్నాయి. ఇటీవల కాలంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుణ్యమా అని రాష్ట్రంలో దాదాపు అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో డ్రైనేజీలు సిమెంట్ రోడ్లు నిర్మించబడ్డాయి.అయితే మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామపంచాయతీలోని పెంటపల్లి గ్రామంలో డ్రైనేజీలు, రోడ్లు నిర్మించకపోవడంతో మురికి నీరు రహదారుల పైనే ప్రవహిస్తుంది.ముఖ్యంగా ప్రధాన రహదారిలో డ్రైనేజీ లేకపోవడంతో పాఠశాల సమీపంలో నిత్యం మురుగునీరు ప్రవహిస్తూనే ఉంటుంది. భగీరధుని విగ్రహం సమీపంలో మురుగునీటి లోంచే వీధిలోకి వెళ్ళవలసిన పరిస్థితి నెలకొనివుంది.వినాయకుని ఆలయం ప్రాంతంలో రోడ్లు కనీసం గ్రావెల్ తో కూడా నిర్మించలేదు.అటు పాలకులుగాని ఇటు అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. మురుగునీరు రోడ్ల పైన ప్రవహిస్తుండటంతో దోమలు విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో గ్రామస్తులు రోగాలు బారిన పడే ప్రమాదం ఏర్పడింది. వెంటనే పాలకులు అధికారులు గ్రామంలో డ్రైనేజీలు రోడ్లు నిర్మించి పారిశుధ్యం నెలకొల్పి తమ ఆరోగ్యాలను కాపాడవలసిందిగా గ్రామస్తులు కోరుచున్నారు.

# అదనపు ఆర్థిక సహాయం అందుకున్న ఇళ్ళ నిర్మాణం నూటికి నూరు శాతం పూర్తి చెయ్యాలి



కలెక్టరు పి.ప్రశాంతి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రిల్ 3:**
ఇండ్ల నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సహాయం విడుదల చేసిన లబ్దిదారులచే మే నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా పర్యవేక్షణ బాధ్యత అధికారులు, సిబ్బంది వహించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, డివిజన్, నియోజక వర్గాల అధికారులు, ప్రత్యేక అధికారులతో హౌసింగ్ ఇన్చార్జి పిడి ఎస్.భాస్కర్ రెడ్డితో కలిసి గూగుల్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మే 31 నాటికి జిల్లాలో 10,794 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి, ప్రారంభించేలా తూర్పు గోదావరి జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు 4,929(46 శాతం) లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. ఇంకా 5,865 ఇళ్లను పూర్తి చెయ్యాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరికం లేని సమాజ స్థాపన ధ్యేయంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్వంత ఇంటి నిర్మాణం ద్వారా 50 శాతం పేదరికం జయించినట్లే అని పేర్కొన్నారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసే ఉద్దేశ్యంతో ఇంటి నిర్మాణం కోసం ముందుకు వచ్చిన లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ, బీసీలకు అదనపు ఆర్థిక సహాయం విడుదల చెయడం జరిగిందన్నారు. అదే విషయంపై క్షేత్ర స్థాయిలో లబ్దిదారులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మార్చి 31 వరకు ఇచ్చిన గడువు ముగిసిన, లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ముందుకు రావడంతో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అదనపు ఆర్థిక సహాయం విడుదల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్సైట్ లో అవకాశం ఉందని కలెక్టర్ తెలియ చేశారు. అదనపు ఆర్థిక సహాయం దరఖాస్తు చేసుకునే వెసులుబాటుపై మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ డిఈ, ఏఈ, ఎంపిడివో లు ఆ మేరకు జవాబుదారీతనం చేయనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం కోసం 5330 మంది లబ్దిదారులు అంగీకారం తెలియ చెయ్యగా, వారిలో 3378 మందికి రూ.7 కోట్ల 64 లక్షలు విడుదల చెయ్యడం జరిగిందన్నారు. స్టేజ్ కన్వర్షన్ విధానంలో క్షేత్ర స్థాయి ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ఎంపిడివోలు వ్యక్తిగత బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణం కోసం ఆసక్తి చూపిన వారికి నిధులు విడుదల చెయ్యడం జరిగిందని, వాటిని ఇంటి నిర్మాణం కోసం మాత్రమే ఉపయోగించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణం కోసం కాకుండా ఇతరత్ర ఖర్చు చెయ్యకుండా చూడడానికి స్టేజ్ కన్వర్షన్ విధానంలో సాధ్యం అవుతుందని తెలిపారు. అనపర్తి, నల్లజెర్ల, కొవ్వూరు, చాగల్లు , రాజమండ్రి అర్బన్, కొవ్వూరు అర్బన్ పరిధిలో అదనపు ఆర్థిక సహాయం పొందిన లబ్దిదారులు ఎక్కువగా ఉన్నారని, ఆమేరకు స్టేజి కన్వర్షన్ విధానంలో మెరుగైన పని తీరు ఉండాలన్నారు. ఇకపై వారం వారం సహాయ ఇంజనీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనితీరుపై సమీక్ష చేస్తామని, అదనపు ఆర్థిక సహాయం దుర్వినియోగం కాకుండా సక్రమ వినియోగంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా ఆధ్వర్యంలో ఇతర లబ్దిదారులకు అదనపు ఆర్థిక సహాయం కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం కోసం ఆప్షన్ విషయమై మరోసారి క్షేత్ర స్థాయిలో ఆమేరకు గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంచార్జ్ హౌసింగ్ పిడి ఎస్.భాస్కర్ రెడ్డి తెలిపారు. మరోసారి ఇంటి నిర్మాణం కోసం ఆసక్తి కలిగిన లబ్దిదారులు స్టేజ్ కన్వర్షన్ విధానంలో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని తెలియ చేశారు. మే 31 నాటికి ఇంకా పూర్తి చెయ్యవలసిన 5,865 ఇండ్ల స్టేజి కన్వర్షన్ పై రోజు వారి ప్రగతి సాధించడంపై దృష్టి పెట్టాలని కోరారు. ఇంటి నిర్మాణం స్టేజి కన్వర్షన్ ఆధారంగా హౌసింగ్ అధికారులు జీతాలు చెల్లింపు జరపాలని కలెక్టర్ స్పష్టం చేసినట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి ఎస్.భాస్కర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి ఎన్వివిఎస్.మూర్తి, హౌసింగ్ ఐటి పర్సన్ టి.విద్యా సాగర్ లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న

# అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన

**– కమీషన్ చైర్ పర్సన్ తేజస్వి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రిల్ 3:**రాజమహేంద్రవరం నగరంలోని లాలా చెరువు రహదారి మార్గంలో "అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన" కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి(క్రియేటివిటీ అండ్ కల్చర్) కమీషన్ చైర్ పర్సన్ తేజస్వి తెలియచేశారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలో "అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన" కార్యక్రమం వివరాలు పాత్రికేయుల సమావేశంలో తెలియ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పి.తేజస్వి మాట్లాడుతూ ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో కళలకి తిరిగి పూర్వ వైభవం తీసుకుని రావడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా కళలకు, సంప్రదాయాలకు ఎటువంటి ఆదరణ లభించలేదని, అందుకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాలను చేపట్టలేదని పేర్కొన్నారు. ఎంతో గొప్ప కళాకారులు, పద్మశ్రీ అవార్డులు వంటి విలువైన అవార్డు గ్రహీతలు ఉన్న వారికి సముచిత గౌరవం లభించలేదు అన్న విషయాన్ని గుర్తుకు తెస్తున్నట్లు తెలిపారు. అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనని పురస్కరించుకుని ప్రముఖ కళాకారుల చిత్ర ప్రదర్శనలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు, అందుకు అనుగుణంగా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ప్రదర్శిస్తున్న వివిధ కళా ప్రదర్శనలను అధ్యానం చేసినట్లు ఆమె తెలిపారు. గత రెండు దశాబ్దాలగా కర్ణాటక రాష్ట్రంలో చిత్ర కళా ప్రదర్శనలకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి రావడం జరిగిందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కూడా వివిధ సాంస్కృతిక కళా రీతులలో కూడిన వివిధ ప్రదర్శనల సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందులు దుర్గేష్ చొరవతో ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున చేపట్టినట్లు ఆమె వివరించారు. ఈ "అమరావతి చిత్ర కళా వీధి ప్రదర్శన" కి ద్వారా వొచ్చే నిధులతో రాజమండ్రిలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ది చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రతి ఏడాది ఈ వీధి ప్రదర్శన కొనసాగించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

## అమాయక అడవి బిడ్డలపై అఘాయి త్యాలు

# తెలిసినా చర్యలు తీసుకోలేని అధికారులు






**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గం పరిధిలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాలలో గిరిజన బిడ్డలపై అఘాయిత్యాలు జరుగుతున్నా, తెలిసిన సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ల పరిధిలో 35 గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలు,వసతి గృహాలు ఉన్నాయని, చాలా పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని స్థానికులు తెలిపారు. నిబంధనల ప్రకారం బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులే ఉండాలనే నియమ, నిబంధనలు ఉన్నాయన్నారు. ఐ టి డి ఏ, సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిబంధనలను సడలించి, పురుష ఉపాధ్యాయులను నియమిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పురుష ఉపాధ్యాయుల వలన ఏ సమయంలో ఏ ఉపద్రవం బాలికలపై ముంచుకు వస్తుందో తెలియని పరిస్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గంగవరం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోనూ, దాలిపాడు ఆశ్రమ ఉన్నత పాఠశాలలోనూ, అడ్డతీగల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోనూ, బాలికలపై అఘాయిత్యాలు జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మండల కేంద్రంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో ఒక గిరిజన విద్యార్థిని గర్భం ధరించిన ఉదంతం బయటకు రావడంతో, సంబంధిత అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారని ఆరోపిస్తున్నారు. చేతులు కాలాక ఆకుల పట్టుకున్న చందంగా గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలల్లో పురుషుల ఉపాధ్యాయుల నియమిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపిస్తున్నారు. వసతి గృహాల ఆవరణలోనే సంక్షేమ అధికారులు, పురుష ఉపాధ్యాయులు నివాస ఉంటున్నారని అంటున్నారు. ఇకనైనా ఐటిడిఏ అధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరం నుండి అయినా బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 3:** జగ్గంపేట మండలం నరేంద్రపట్నం, ఇర్రిపాక 11 కెవి విద్యుత్ ఫీడర్ నందు మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వీరభద్ర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని దృష్ట్యా ఇర్రిపాక, నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాలకు, బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే నంది సెంటర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాట్రావులపల్లి, యర్రంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని కోరారు.

# ఖాతాదారుల పాలిట శాపం గా మారుతున్న బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు...

### ఖాతాదారులకు న్యాయం చేయాలని ఆదివాసీ నాయకులు డిమాండ్...






**దేవీపట్నం,పెన్ పవర్,ఏప్రియల్3:**ఇందుకూరుపేట గ్రామంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులు,పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పాలిట శాపంగా మారుతుంది.డబ్బులు కోసం వచ్చిన ఖాతాదారులుకు ఇక్కడ చేదు అనుభవం ఎదురు అవుతుంది.డబ్బులు తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు,చంటి బిడ్డల తల్లులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ఉదయం వస్తే సాయంత్రం వరకు వేచి చుస్తే కానీ డబ్బులు ఇచ్చే పరిస్థితి ఈ బ్యాంకు లో కనిపించడం లేదు.బంగారం పై అప్పు కి వచ్చిన మహిళలుకు రెండు రోజులు అవుతే గాని డబ్బులు చేతికి రావడం లేదు.ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఉదయం వచ్చిన ఖాతాదారులకు సాయంత్రం వరకు ఉంచి డబ్బులు ఇవ్వడం తో బ్యాంకు సిబ్బంది, మేనేజర్ పై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా చూడటంలో మేనేజర్ విఫలం అవుతున్నారని వాపోతున్నారు.ఖాతాదారులు పడుతున్న ఇబ్బందుల కోసం సిబ్బందిని సంప్రదించగా తమ యొక్క బ్రాంచి విశాఖపట్టణం పరిధిలో ఉండటం వలన డబ్బులు ఖాతాదారులకు త్వరగా ఇవ్వలేకపోతున్నామని సమాధానం ఇస్తున్నారు.హాస్పిటల్లో చికిత్స నిమిత్తం తమ వారి కోసం ఇక్కడ డబ్బులకు వచ్చినా లేవని సమాధానం చెబుతున్నారని ఖాతాదాలకు, వ్యాపారస్తులకు ఇబ్బంది లేకుండా బ్యాంకు పని వేళల్లో తప్పకుండా డబ్బులు ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లని శేఖర్, దేవీపట్నం మండలం బిజెపి అధ్యక్షులు కారం రామన్న దొర, ఆదివాసి నాయకులు వెలగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# దొమ్మేరులో రీ సర్వే గ్రామ సభ




**కొవ్వూరు, పెన్ పవర్, ఏప్రిల్ 3:**మండలంలోని దొమ్మేరు గ్రామంలో గురువారం రెండోవ దశ రీ-సర్వే గ్రామసభ, ర్యాలీకి ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జెసి చిన్న రాముడు మాట్లాడుతూ భూముల రీ సర్వే పై అభ్యంతరాలు నేపథ్యంలో సిసిఎల్ఏ కమీషనర్ ఆదేశాలను అనుసరించి క్షేత్ర స్థాయిలో రెండవ దశ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ యజమానులు, రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో కూడిన భూముల రీ సర్వే చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించే ప్రక్రియ మేరకు రెండో దశ ప్రారంభం చెయ్యడం జరిగిందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు, రీ సర్వే లో తగిన వివరాలు, రికార్డులు అందచేసి అధికారులకి, క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సహకరించాలని ఆర్డీవో రాణి సుస్మిత కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, తహశీల్దార్ దుర్గా ప్రసాద్, సర్వే ఇన్స్పెక్టర్, మండల, గ్రామ సర్వే బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రవితేజ శర్మ కి తిరుపతి వేదిక్ యూనివర్సిటీ ప్రశంసా పత్రం




**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03:**శైవాగమ యువ కిషోర్ ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం ఆలయ అర్చకులు బ్రహ్మ శ్రీ కాళ్లకూరి రవితేజ శర్మకి తిరుపతి శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శైవాగమ పండిత ప్రశంసా పత్రం తిరుపతిలో అందజేశారు. గత 21 రోజులుగా జరుగుతున్న ఆన్ లైన్ క్లాసుల్లో వేదిక్ యూనివర్సిటీ ద్వారా శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాలలో నిర్వహించారు. ఈ క్లాసులలో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి తిరుపతిలో వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో "ఇంటర్నేషనల్ ప్రశంస పత్రాలతో " పాటు గుర్తింపు పత్రాలను అందించారు. ఈ క్లాసులలో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన రవితేజ వర్మ కి శైవాగమ శాస్త్ర సారావళి జ్ఞానపాదం విభాగంలో ప్రశంసాపత్రం, గుర్తింపు పత్రం లను అందజేశారు.

## 2 లక్షల విలువైన ట్రాన్స్ఫార్మర్ లో రాగి తీగల చోరీ





**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03:**మండలంలోని జొన్నాడ లంక గ్రామంలో గోదావరి నది ఏటిగట్టు సమీపాన ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్లో రాగి తీగలు చోరీకి గురైనట్లు స్థానిక రైతులు తెలిపారు. ఆ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను అధికారులు ఏర్పాటు చేశారన్నారు. అయితే బుధవారం రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి ట్రాన్స్ఫార్మర్ ను ధ్వంసం చేసి దానిలోని రాగి తీగలను చోరీ చేశారన్నారు. ఈ ట్రాన్స్ఫార్మర్ విలువ సుమారు 2 లక్షల రూపాయల విలువ ఉంటుందని స్థానిక లైన్మెన్ తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకుని, ఆ ప్రదేశంలో మరొక ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుచున్నారు.

## చింతలపూడిలో కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 13వ మహాసభ




**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్ :3:**దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద వర్గాలకు తీవ్రమైన నష్టం జరిగిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చింతలపూడి మండలం 13వ మహాసభ ఎస్కే కాలేషా జంగా రామచంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద వర్గాలకు తీవ్ర నష్టం జరిగిందని రైతాంగం కి వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలు కార్మిక వర్గం కి వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని వీటి వలన పని పని గంటల పెంపు కార్మిక హక్కులను హరించడం ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవడం జరుగుతుందని ప్రభుత్వంగా సంస్థలు నాలుగు శాతం వరకు మాత్రమే ఉన్నాయని మిగతాదంతా ప్రైవేట్ పరం అయిందని ప్రైవేట్ రంగంలో ఉద్యోగ భద్రత లేదని ప్రైవేట్ రంగంలో వివిధ పేర్లతో ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారని. కేంద్ర ప్రభుత్వం నచ్చని పార్టీలను బ్లాక్ మెయిల్ చేస్తుందని అన్ని రాష్ట్రాలను కేంద్రం కింద ఉంచుకొని రాష్ట్రాలకు రావాల్సిన వాటాను ఇవ్వడంలేదని సమైక్య స్ఫూర్తిగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తుందని న్యాయ వస్తా ప్రమాదంలో పడిందని కేంద్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థను ఎన్నికల కమిషన్ను తన చేతిలో పెట్టుకుందని. సతీష్ గడ్లో ఉన్న అటవీ కనీసంపదను ఆదాని అంబానీలకు కట్టబెట్టడం కోసం రాయపూర్ నుంచి గంగవరం వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నారని ఒక సంవత్సర కాలంలో ఆదాని సంపద లక్ష కోట్లకు పెరిగిందని . 80 కోట్లకు రేషన్ పంపిణీ జరుగుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన చేశారంటే 80 కోట్ల మంది పేదలు ఉన్నట్లేనని అన్నారు దేశంలో వైద్య సౌకర్యాలు లేవని వైద్యం కార్పొరేట్ పరం అయిందని వైద్యం అమ్ముకోవడానికి పనిచేస్తున్నారని. విద్యుత్ కష్టాలు పెరిగాయని భవిష్యత్తులో వీటిపై పోరాటం చేయాలని. గత ప్రభుత్వంలో 30 లక్షల మందికి ఇల్లు ఇచ్చామని చెప్పారని కానీ ఈ రోజు ఎంతోమంది ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని అప్పటి ప్రభుత్వం స్థలాలు ఇచ్చారు గాని వారికి ఎక్కడ ఇచ్చారో చూపించలేని పరిస్థితి ఉందని ఈ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఇట్లో ఇళ్ల గురించి గ్రామాల్లో మూడు సెంట్లు పట్నాలలో రెండు సెంట్లు ఇస్తానన్న హామీ గురించి మాట్లాడడం లేదని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం టు అమరావతి మాత్రమే ఆలోచిస్తున్నారు తప్ప పేదల గురించి ఆలోచించడం లేదన్నారు పోలవరం ప్రాజెక్టు 41.15 అంటే గగ్గోలు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు అదే పాట పాడుతున్నారని 41.15 గా ప్రాజెక్టు నిర్మిస్తే ప్రయోజనం ఉండదని ఉత్తరాంధ్రకు నీటి జలాలు ఇవ్వలేమని కరెంట్ ఉత్పత్తి రాదని కాబట్టి పోలవరాన్ని 45. 72గా నిర్మించాలని చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ఉమ్మడి ఎన్టీఆర్ జిల్లా ఏలూరు జిల్లాకు కు నిరంధించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభకు ముందుగా సిపిఐ జెండాను సిపిఐసీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు ఆవిష్కరించారు. మహాసభ ప్రారంభ సూచికగా తొర్లపాటి బాబు గత మహాసభ నుంచి ఇప్పటివరకు చనిపోయిన పార్టీ నాయకులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య గత మహాసభ నుంచి ఇప్పుడు వరకు పార్టీ చేసిన కార్యకలాపాలను ప్రవేశపెట్టారు ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య జిల్లా కార్యవర్గ సభ్యులు జై రమణ రాజు. టీవీఎస్ రాజు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే బుచ్చిబాబు తదితరులు మాట్లాడారు ప్రజానాట్యమండలి కళాకారులు ఎం అలెగ్జాండర్ ఎస్ లెనిన్ బాబు విప్లవ గేయాలు ఆలపించారు సిపిఐ నాయకులు బోడ వజ్రం పి సోమశేఖర్ దొంత కృష్ణ ఎస్ కే జానీ ఎస్కే మస్తాన్ ముల్ల గిరి నాగేశ్వరరావు ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు ముల్లంగి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారాయి కేసులో 1,75,000 జరమాన




**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:3:** నవోదయం 2.0 కార్యక్రమం లో భాగంగా చింతలపూడ స్టేషన్ పరిధి లో పలు పాత నాటు సారాయి కేసులలో నిందితుడు అయిన చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామము కు చెందిన ,ఇంజుమూడి రాంబాబులి అతనిని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చింతలపూడి తహసిల్దార్ వారి ముందు ఇది వరకు 129 బి ఎన్ ఎస్ ఎస్ చట్టం ప్రకారము బైండ్ ఓవర్ బాండ్ చేయగా , సదరు బాండ్ ను ఉల్లంఘించి నందుకు మరియు కొత్తగా నాటు సారాయి కేసు లో నిందితుడు గా పట్టుబడినచో సదరు బైండ్ ఓవర్ బాండ్ ను ఉల్లంఘించి నందుకు గాను ఇతనికి జరిమాన రూ.1,75,000/- చెల్లించవలసిదిగా మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చింతలపూడి వారు నోటీస్ జారీ చేయడమైనది


రి.క.నెం.163/2025/సి

మండల కార్యనిర్వాహక మెజిస్ట్రేట్ వారి కార్యాలయము, చింతలపూడి, తేది: 01.04.2025.

నోటీసు

- శ్రీ ఇంజమూడి రాంబాబు (తండ్రి) పోట్టియ్య, రాఘువాపురం గ్రామం, చింతలపూడి మండలం.
- ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్, చింతలపూడి, ఏలూరు జిల్లా.

## ఎక్సైజ్ హెచ్ సి శ్రీనివాస్ కు ఎస్సై గా పదోన్నతి



**ఆలమూరు,పెన్ పవర్, ఏప్రిల్ 03:**ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న గెడ్డం శ్రీనివాస్ కు ఎస్సైగా పదోన్నతి లభించింది. ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న హెచ్సీలకు పదోన్నతులు కల్పించడంలో భాగంగా ఆలమూరు కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్ ను పదోన్నతికి ఎంపిక చేశారు. ఎస్సైగా పదోన్నతి లభించిన శ్రీనివాస్ ను ఆలమూరు ఎక్సైజ్ కార్యాలయంలోనే సబ్ ఇన్స్పెక్టర్గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఎక్సైజ్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ ను సిఐ నాగేశ్వరరావు తోపాటు పలువురు అభినందించారు.

## జాబ్ మేళాలో 18 మంది ఎంపిక



**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** ఉన్నతి కార్యక్రమం ద్వారా నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది ని ఎంపిక చేయడం జరిగిందని ఏపీవో సాయిబాబా తెలిపారు.

గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు 28 మంది హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి మూడు నెలల పాటు సామర్లకోట, రాజమండ్రి,అడ్డతీగల లో ఉన్న వైటీసీ కేంద్రా లలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శిక్షణ కాలమును బట్టి రోజుకి 300 రూపాయలు చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట నుండి ట్రైనర్ రత్నకుమార్,జాబ్ కోఆర్డినేటర్లు ప్రసాద్,నూకరాజు హాజరయ్యారని తెలిపారు.

## భీమడోలు సెక్షన్ పరిధిలోవిద్యుత్ సరఫరా నిలిపివేత

**ఏలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3 :** ఈనెల మూడో తేదీ నుండి 6వ వరకు భీమడోలు సెక్షన్ పరిదిలోని 33/11 కెవి పూళ్ళ సబ్-స్టేషన్ పరిదిలోని మొక్కలు కటింగ్ మరియు విద్యుత్ లైన్ మరమ్మతులు చేయుటవలన మరియు కొత్త లైన్స్ వేయడం వలన 11 కెవి పూళ్ళ, ఎం ఎం పురం, కురేళ్లగూడెం, దుద్దేపూడి,11 కెవి ఇండస్ట్రియల్,ఫీడర్లకు ఉదయం 09 .00 గంటల నుండి మద్యాహ్నం 3 .00 గంటల వరకు సరఫరా నిలిపి వేయబడునని కావున ఈ గ్రామములకు సరఫరా అంతరాయము కలుగును.కనుక వినియోగదారులు సహకరించగలరని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీ కె. ఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## అరుంధతీయులు - అసామాన్యులు పుస్తకావిష్కరణ చేసిన ఎంఎల్ఏ ముప్పిడి




**కొవ్వూరు, పెన్ పవర్, ఏప్రిల్ 3:**సామాజిక స్పృహ కలిగించే అనేక రచనలు, కవితలు వ్రాస్తూ ప్రాచుర్యం పొందుతున్న తాళ్లపూడికి చెందిన విజేత స్కూల్ ప్రిన్సిపాల్, తాళ్లపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అయిన డా.ప్రమోద్ కుమార్ వ్రాసిన "అరుంధతీయులు అసామాన్యులు" అనే పుస్తకాన్ని కొవ్వూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో అరుంధతీయులకు చెందిన పలువురి ప్రముఖుల చరిత్రలు వివరాలను పొందుపరిచారు. ప్రతీ ఒక్కరు తమ అరుంధతీయ ప్రముఖులు కోసం తెలుసుకునేందుకు బుక్ వినియోగపడుతుందని ఎమ్మెల్యే ముప్పిడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,ఏప్రిల్ 3 :**డ్వాక్రా మహిళలకు ఇచ్చే స్త్రీ నిధి సొమ్ములు ఒక గ్రూపుకు మంజూరు అయితే వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం వలన మరొక వ్యక్తి ఖాతాలో జమ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రూప్ సభ్యులు వెలుగు సిబ్బందిని నిలదీయాగా వాయిదాలు మీద వాయిదాలు పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జీలుగుమిల్లికి చెందిన ఆశాజ్యోతి గ్రూప్ సభ్యులు మానూరు శారద దేవుడు శివ నాగేశ్వరి కొండ పర్వమంగాలు ఆరోపిస్తున్నారు . గురువారం గ్రూప్ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం జనవరి 31వ తేదీన ఈ గ్రూపు కి శ్రీనిధి సొమ్ములు మంజూరయ్యాయి .అయితే మూడు రోజుల అయినా గాని తమ ఖాతాలో పడలేదు అని దర్భ గూడెం బ్యాంకుకు వెళ్లి చూడగా ఆ 3 లక్షలు జంగారెడ్డిగూడెం మండలం మంగి శెట్టి గూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఖాతాలో జమ అయ్యాయని బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఇది ఏమిటని వెలుగు సిబ్బంది నిలదీయగా పొరపాటున అలా జరిగింది అతని వద్ద నుండి రికవరీ చేసి మీకు ఇస్తామని కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యక్తి దగ్గరకి వెలుగు సిబ్బంది అడిగి వస్తున్నారు తప్ప వసూలు అవడం లేదు .దీనితో వెలుగు సిబ్బంది ఫిబ్రవరి 12వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. గ్రూప్ సభ్యులు ఎప్పుడు అడిగిన ఇస్తాము అంటున్నారు తప్ప ఇవ్వడం లేదని అంటున్నారు. శ్రీనిధి సొమ్ములు మంజూర అయి నాలుగు నెలలు అయినా కానీ మాకు అందకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగు సిబ్బందిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

## ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 3 :**ఆర్యవైశ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) అన్నారు. ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది.కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.కార్యక్రమంలో భాగంగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నూతన కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీరామ సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు.మహాసభ ఉపాధ్యక్షులు గ్రంధి నారాయణ రావు(బాబ్జి),లలితా ఇండస్ట్రీ మట్టే శ్రీనివాస్, పులవర్తి కుమార్, బచ్చు శేఖర్,రాష్ట్ర,ఉభయ గోదావరి జిల్లాల వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు ఘనంగా సన్మానించారు.

# కాకినాడ అక్నూ క్యాంపస్ ను ఆకస్మిక తనిఖీ చేసిన వీసీ



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 3 :**ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ ను వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు.క్యాంపస్ ప్రాంగణాలను, కార్యాలయాలను, వసతీ గృహాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో సిబ్బంది హాజరు, పనితీరుపై ప్రిన్సిపాల్ ఆచార్య ప్రశాంతిశ్రీ ని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో అన్ని కోర్సులు సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది క్రమశిక్షణతో సమయపాలన పాటించాలని, విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్దులు నేర్పించాలని తెలియజేశారు. అందరికీ ఉన్నత విద్య అందించాలనే మల్లాడి సత్యలింగం నాయకర్ వంటి మహనీయుల ఉన్నత లక్ష్యాలు ఈ క్యాంపస్ ద్వారా సాకారం కావాలని, దానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. తర్వాత వసతి గృహాన్ని సందర్శించిన వీసీ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. వసతి గృహాన్ని, మెస్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. క్యాంపస్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే చక్కని వాతావరణంలో చదువుకోవడానికి వీలవుతుందని చెప్పారు. సమష్టిగా పని చేసి కాకినాడ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## భావన్నారాయణ స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్న కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 3 :**కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని శ్రీ భావన్నారాయణ స్వామి దేవస్థానాన్ని గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీతో కలిసి దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భావనారాయణ స్వామి దేవస్థానం యొక్క చరిత్ర, విశిష్టతను ఈ సందర్భంగా పండితులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం సర్పవరం ఏపీఐఐసీ భూములు అనుకుని ఉన్న దేవస్థానం భూములను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, కాకినాడ రూరల్ మండలం తహసిల్దార్ ఎస్ఎల్ఎన్ కూమారి, భావనారాయణ స్వామి దేవస్థానం ఈవో ఎం. లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రియల్ 5న డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 117 వ జయంతి వేడుకలు

**కలెక్టర్ షన్మోహన్**



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 5 :**ఏప్రియల్ 5 వ తేదీన డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 117 వ జయంతి ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 5 వ తేదీన ఉదయం 9.30 గంటలకు కాకినాడ లయన్స్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్, ఇంద్ర పాలెం వద్ద గల బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ 117 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి కోరారు.

# ఎన్టీఆర్ బీచ్ లో పనులను సకాలంలో పూర్తి చేయాలి



**కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 3 :**కాకినాడ ఎన్టీఆర్ బీచ్ లో జరుగుతున్న పనులను వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట వద్ద నన్ను ఎన్టీఆర్ బీచ్ లో జరుగుతున్న పనులను గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు పంతం నానాజీతో కలిసి పరిశీలించారు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యకలాపాల పురోగతి, మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయాలు ఏర్పాటుపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ..పర్యాటక, కాకినాడ నగరపాలక సంస్థ, పంచాయతీ, కుడా తదితర శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ సందర్శకులకు అణువుగా కాకినాడ ఎన్టీఆర్ బీచ్ ను సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.బీచ్ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువుగా బీచ్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా మెరుగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధి పనులు చేపట్టిందని ఆయన తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేసి బీచ్ పనుల్లో పురోగతి కనబరచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్లాస్టిక్, తూటు, ఇతర పిచ్చిమొక్కలు తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ గా బీచ్ పార్క్ ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

ఈ పరిశీలనలో ఇన్చార్జి పర్యాటక అధికారి చైత్రవర్షిణి, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఏపీటీడీసీ ఏఈ వెంకటేష్, కుడా ఈఈ సీహెచ్ .రామారావు, జిల్లా పంచాయతీ సిబ్బంది ఇతర అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## జమ్మలమడక నాగమణికి ఘన సన్మానం



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 3 :**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్, మాజీ ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి ని మహిళా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.మాజీ ఎంపీ మార్గాని భరత్ క్యాంప్ కార్యాలయంలో జమ్మలమడక నాగమణిని సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం లో ఉన్న లేకున్నా ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేసే నాయకురాలని ప్రభుత్వ విధానాలను ఎండగట్టే దమ్మున్న నాయకురాలు జమ్మలమడక నాగమణి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మహిళా అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి శ్యామల, పార్టీ మహిళా నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవం





- ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని శాఖల అధికారులతో సమావేశం
- అందరూ సహకరించాలి : ఎమ్మెల్యే సత్యానందరావు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రియల్ 3:**వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే,కలెక్టర్,జాయింట్ కలెక్టర్,ఎస్పీ,ఆర్డీఓ,డీఎస్పీ లు పాల్గొన్నారు. గురువారం వెంకన్న సన్నిధిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ
కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. ముందుగా వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం దేవస్థాన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సత్యానందరావు,కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్,జాయింట్ కలెక్టర్ నిశాంతి,ఎస్పీ కృష్ణారావు,ఆర్డీఓ శ్రీకర్,డీఎస్పీ మురళీ మోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు, మాట్లాడుతూ ఈ నెల 7 వ తేదీన ధ్వజారోహణ కార్యక్రమం,8 వ తేదీన రథోత్సవం మరియు స్వామి వారి కళ్యాణం మహోత్సవం జరుగుతుందని తెలిపారు.9 వ తేదీన పొన్న వాహన సేవ,10 వ తేదీన సదస్యం,మహాదాశీర్వచనము,11వ తేదీన తెప్పోత్సవం,12 వ తేదీన చక్రస్నానం,13 వ తేదీన శ్రీ పుష్పోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కళ్యాణ మహోత్సవానికి హాజరవుతారని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ముఖ్యంగా పరిశుభ్రత,శాంటినేషన్ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చెయ్యాలన్నారు.అలాగే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు.ఎండలు ఎక్కువగా ఉండటంతో వాటికి తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని అలాగే వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో అవసరమైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగేందుకు అందరూ అందరూ సహకరించాలని ఎమ్మెల్యే సత్యానందరావు కోరారు.

# గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకోవాలి: డాక్టర్ హారిక.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:** గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని డాక్టర్ హారిక అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ శైలజ సూచనల మేరకు గురువారం సహజ ప్రసవం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ హారిక మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యకరమైన పౌష్టి కాహారంతో పాటు ఎప్పటికపుడు ఆరోగ్య నియమాలు పాటించాలని, ఆరోగ్యపరంగా తీసుకోవ లసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. గర్భందాల్చిన మహిళలు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవటమే కాకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు సూచనల మేరకు మంచి పోషక విలువులు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకూ సీజేరియన్ లేకుండా సహజ ప్రసవం జరిగేలా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రబాబు ముస్లింల ద్రోహి.

## వక్ఫ్ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం.

## షేక్ అలీఖాన్ బాబా.

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 3 :**వక్ఫ్ బోర్డు చట్టానికి మద్దతు పలికిన టిడిపి అధినేత చంద్రబాబు చరిత్రలో ముస్లిం ద్రోహి గా నిలిచిపోతారని షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా విమర్శించారు. గురువారం మండపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. లోక్ సభ లో వక్ఫ్ బిల్లు ఆమోదంపై నిరసన తెలిపారు. వక్ఫ్ బోర్డులో ఇతరులకు అవకాశం ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా చంద్ర బాబు ముస్లిం ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. టిడిపిలోని మైనార్టీలు పునరాలోచించు కోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే వారిని ముస్లింలు వెలివేస్తారని హెచ్చరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద ముస్లింల కోసం రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మైనార్టీలకు పెద్దపీట వేశారని కొనియాడారు. మైనార్టీల సంక్షేమానికి రు 26 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత జగన్ దే అని పేర్కొన్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జగన్ ముస్లిం ల కోసం తీసుకొచ్చారని పేర్కొన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ లో సవరణ బిల్లులు తమ పార్టీ వ్యతిరేకించిందన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదించిన వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 ,25 ,26 స్ఫూర్తికి వక్ఫ్ సవరణ బిల్లు తూట్లు పడుతుందన్నారు. ప్రజాస్వామ్య సెక్యులర్ దేశంలో ముస్లింలను ద్వితీయ పౌరులు స్థాయికి దిగజార్చేందుకు ఎన్డీఏ ప్రయత్నిస్తుందని విమర్శించారు .1954 నుంచి అమలులోకి వచ్చిన వక్ఫ్ చట్టానికి గతంలో జరిగిన సవరణలకు నేటి సవరణలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. గత ప్రభుత్వాలు ముస్లిం మత పెద్దలతో చర్చించాకే సవరణలు చేసిన సంఘటనలు గుర్తు చేశారు. మసీదులు దర్గాలు ఆశురాఖనాలు స్మశానాల నిర్వహణ కోసం ముస్లిం లు భూమిలను దానంగా ఇచ్చారని తెలిపారు. అవి అల్లాకు సంబంధించిన ఆస్తులుగా తాము భావిస్తామన్నారు. నేటి ఎన్డీఏ ప్రభుత్వం దాని అర్థాన్ని మార్చేస్తుందన్నారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన ఆధార పత్రాలు చూపమంటే ఎవరు చూపగలరని ప్రశ్నించారు. ఎవరు వక్ఫ్ చేయాలన్న వారు ఐదేళ్లు ముస్లిం గా ప్రాక్టీస్ చేసి ఉండాలని ఇందుకు సంబంధించిన డిక్లరేషన్ కోరడం ఏమిటనీ ఆయన మండిపడ్డారు. ముస్లింలు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు తగిన సమయంలో తగిన గుణపాఠం నేర్పుతాయని హెచ్చరించారు.



# డ్రగ్స్ తీసుకున్న, రవాణా చేసిన చట్టరీత్యా కఠినమైన శిక్షలు






కాకినాడ జిల్లా ఎస్పీబిందు మాధవ్

**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, ఏప్రిల్ 3:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాల నివారణ, శక్తి యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడిన, రవాణా చేసిన చాలా నష్టపోతారన్నారు. విద్యార్థులందరూ ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. డ్రగ్స్ తీసుకున్న , కలిగి ఉన్న, రవాణా చేసినట్లు దొరికిన విద్యార్థులు ఎటువంటి కఠినమైన శిక్షలు ఎదుర్కోవలసి ఉంటుందో సెక్షన్ లతో సహా వివరించారు. ఏ విద్యార్థి అయినా డ్రగ్స్ కేసులో నేరం రుజువైతే అతనికి చట్టరీత్యా కఠినమైన శిక్షలు అనుభవించవలసి రావడమే కాకుండా ఎంతో ఉజ్జ్వలమైన భవిష్యత్తును కోల్పోవలసి వస్తుంది అని తెలిపారు. శక్తి యాప్ గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని విపత్కర సంఘటనలు ఎదురైనప్పుడు కేవలం మొబైల్ ను షేక్ చేయడం ద్వారా పోలీస్ అధికారులు రక్షణ లభిస్తుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శక్తి ఆప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలి అని చెప్పారు. అదే విధంగా మన రాష్ట్రాన్ని మాత్రమే కాకుండా యావత్ దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్య సైబర్ క్రైమ్ అని దీని ద్వారా అనేక మంది అవగాహన లేని కారణంగా అధిక మొత్తంలో డబ్బులు నష్టపోతున్నారని కావున అటువంటి సైబర్ నేరగాళ్ల ఫోన్ చేసిన యడల వెంటనే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఒక వేళ సైబర్ క్రైంలో నష్టపోతే మొదటి అరగంటలో అధికారులకు తెలియపరిచిన రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎస్పీ బిందు మాధవ్ ను ఆదిత్య యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు, ఎస్.బి.డి.ఎస్. పి.శ్రీరామ్ కోటేశ్వరరావు, ట్రైనింగ్ డి.ఎస్.పి సిహెచ్. జీవన, జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ సేవా సమితి సేవలు స్ఫూర్తిదాయకం..



**అనపర్తి,పెన్ పవర్,ఏప్రిల్ 3:** రామకృష్ణ సేవా సమితి అనపర్తి శాఖలో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నల్లమిల్లి సుబ్బారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని కోస్తా ఆంధ్ర రెడ్డి అసోసియేషన్ అధ్యక్షులు త్రినాథ రెడ్డి పేర్కొన్నారు. ఉగాది రోజున అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్న సుబ్బారెడ్డిని అసోసియేషన్ ఉచిత రీతిని సత్కరించింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా రామకృష్ణ సేవా సమితి అనపర్తి పరిసర ప్రాంతాలలో విద్యా, సామాజిక రంగాలలో ఎనలేని సేవలుతో స్వామీజీ భావజాలం ప్రజలలో ద్వారా చైతన్యాన్ని నింపారన్నారు. కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త సినీ నిర్మాత చింత గోపాలకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ వీరు చేస్తున్న సేవలకు ఇటువంటి పురస్కారాలు ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కార గ్రహీత సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో తాడి చంద్ర రామచంద్ర రెడ్డి కే ఎస్ ఎన్ రెడ్డి, చింతా వీర రాఘవరెడ్డి (సిరి) ఎన్డీఏ కూటమి నాయకలు నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, తాడి సతీష్ రెడ్డి, శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు ముడే దుర్గాప్రసాద్, రెడ్డి సంఘం సభ్యులు సత్తి వెంకటరెడ్డి (బుల్లి తమ్ము ), యువజన అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్ రెడ్డి, సంఘ సభ్యులు సత్తి పోతారెడ్డి, చింత నాగు రెడ్డి, డా.నల్లమిల్లి ఆదిరెడ్డి, నల్లమిల్లి విను రెడ్డిలు పాల్గొన్నారు.

## డా.శ్రీ సాహిత్యకు వైద్య జ్యోతి అవార్డు



**పెనుమంట్ర (పాలకొల్లు), పెన్ పవర్, ఏప్రిల్-03:** పాలకొల్లు శ్రీ జనతా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డా. సాహిత్య కు వైద్య జ్యోతి అవార్డు లభించింది.
రోగుల ఆరోగ్యమే ద్యేయంగా శ్రీ జనతా హాస్పిటల్ ద్వారా రోగులకు సేవలందిస్తూ. పాలకొల్లు లోనే అందుబాటులో ఉన్న క్రిటికల్ కేర్ గల వైద్యం సదుపాయం అందిస్తున్న మల్టీ స్పెషాలిటీ గల జనతా ఆసుపత్రి డా. శ్రీ సాహిత్య అందిస్తున్న వై ద్య సేవలు గురించి పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెసు పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి న్యాయవాది కర్రా జయ సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకొల్లు లోనే క్రిటకల్ కేర్ వైద్య సదుపాయాన్ని తీసుకుని రావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ లోనే ఈ వైద్య సదుపాయాన్ని అందించే డాక్టర్స్ ఇద్దరే ఉండగా ఒకరు శ్రీ సాహిత్య అని అన్నారు. జనతా ఆసుపత్రి ద్వారా వైద్యం అందించడం ఎంతో అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా కుటుంబ సభ్యులు జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడి శెట్టి చిట్టిబాబు, దేవ రాజేష్, వీరా మల్లికార్జునుడు గారు,రామాంజుల చిన మదు, దుర్గేష్, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల తాగునీటి కల నెరవేరుతోంది : ఆర్.రవిరాజు

ఎమ్మెల్యే పితాని చొరవతో శర వేగంగా పనులు



**పెనుమంట్ర (పోడూరు), పెన్ పవర్, ఏప్రిల్ 3:** పశ్చిమగోదావరి జిల్లా మండల కేంద్రమైన పోడూరులో ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ వారి కార్యాలయం, విద్యుత్ శాఖ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం, పోలీస్ స్టేషన్, వ్యవసాయ శాఖ కార్యాలయం, గృహ నిర్మాణ సంస్థ శాఖ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం పలు మండల కార్యాలయాలు సముదాయ ప్రాంతానికి పంచాయితీ సరఫరా చేసే తాగునీరు అందరి పరిస్థితి. దీంతో మండల శాఖ అధికారులు దశాబ్దాలుగా తాగునీటివి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హాజరు కాగా పోడూరు తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫజిల్ ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వెంటనే మండల కార్యాలయాలకు పంచాయతీ ద్వారా సరఫరా చేసే నీరును పైప్ లైన్లను ఏర్పాటు చేసి తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని స్థానిక సర్పంచి చెట్టిబత్తుల సువర్ణ రాజు ను సూచించారు. ఈ క్రమంలో గురువారం సర్పంచ్ చెట్టిబత్తుల సువర్ణరాజు సమక్షంలో భూమిపూజ చేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రరాజు రవిరాజు మాట్లాడుతూ ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రజా సమస్య పరిష్కారానికి, సకాలంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంగాకుమారి, కవిటం టిడిపి గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గుబ్బల అప్పన్న స్వామి, ఊడిగ శ్రీనివాసరావు, పోడూరు మాజీ సర్పంచి కొయ్యే మోషేను, టిడిపి నాయకులు బొంతు కాశి, పోడూరు పుచ్చకాయల రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఫేజ్ టూ ఇళ్ళు ఇస్తాం.



చైర్ పర్సన్ రాణి.

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 3:**మండపేట గొల్ల పుంత టిడ్కో అపార్ట్మెంట్ రెండో పేజ్ లబ్ధిదారులకు వారి అపార్ట్మెంట్లు త్వరలో అందజేస్తామని మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతి వాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు.
మండపేట పట్టణం 20వ వార్డు టిడ్కో ఫేజ్ -1 లో మిగిలిన లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించే కార్యక్రమాన్నీ మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు.గురువారం టిడ్కో సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె సందర్శించి ప్లాట్లు అప్పగింత ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కో ఫేజ్-1 లబ్ధి దారులు ఎవరైనా తమ ప్లాట్లను స్వాధీనం చేసుకోకపోతే వెంటనే అధికారులకు సంబంధిత పత్రాలు సమర్పించి స్వాధీనం చేసుకోవాలన్నారు.లబ్ధిదారులు తమ ఇళ్లను పరిశీలించుకొని చేయవలసిన మరమత్తులు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. త్వరలోనే ఫేజ్ -2 ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.వి.రంగారావు,మేనేజర్ హరి మోహన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్,అసిస్టెంట్ ఇంజనీర్లు డి. పవన్ కుమార్, బి.ఆంజనేయులు మెప్మా సి ఎం ఎం సుజాత,టిడ్కో సిబ్బంది, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు,వార్డు ఎమినిటీ కార్యదర్శులు ఆర్.పి.లు పాల్గొన్నారు.

# ప్రవీణ్ కుటుంబానికి అండ గా నిలవాలి.

మండపేట లో శాంతి ర్యాలీ.




**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 3 :**తన మరణం ద్వారా క్రైస్తవ సమాజాన్ని ఏకం చేసిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి ప్రతి క్రైస్తవ కుటుంబం అండగా నిలవాలని అపోస్థలిక్ సహవాస సంఘాల చైర్మన్, ప్రముఖ దైవజనులు డాక్టర్ అంగర ప్రసాద్ పాల్ అన్నారు. ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి శాంతి కలగాలని కోరుతూ మండపేట పట్టణం లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వందలాది మంది క్రైస్తవ విశ్వాసులు పాల్గొని ప్రవీణ్ ప్రగాడాల కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ పాల్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతి పై క్రైస్తవ సమాజానికి అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కటినంగా శిక్షించాలన్నారు. కొందరు ప్రవీణ్ పగడాలపై సోషల్ మీడియా లో అసత్య ప్రకటనలు చేస్తూ క్రైస్తవుల మనోభావాలను గాయపరుస్తున్నారన్నారు. దీనిని తామంతా ముక్త కంఠం తో వ్యతిరేకిస్తున్నామన్నారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి రాష్ట్రం లో మత విద్వేషాలు చెలరేగకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. అయితే ఆయన మరణం తరువాత కూడా క్రైస్తవ సమాజాన్ని ఏకం చేస్తూ క్రీస్తు పరిచర్య చేస్తూనే ఉన్నారన్నారు. ఇటువంటి ఘనత ఆయనకే చెందిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజు మాదిగ, కౌన్సిలర్ సవరపు సతీష్, పాస్టర్ లు ఆర్. ప్రభుకుమార్, సుధాకర్, జాన్, గాబ్రియేల్, జోషెఫ్, విజయ్ కుమార్, చంద్ర శేఖర్, ఆత్మకుమార్, క్రిస్ఫర్, అన్నదాత కొల్లి విశ్వనాథం, ఆనంద్, ప్రిన్స్ డేవిడ్ పాల్, ఆర్.డేవిడ్, కిషోర్, సీఎఫ్ఎం సంగీత కళాకారుల బృందం, అపోస్తలిక్ కింగ్స్ టెంపుల్ విశ్వాసులు, యూత్ సభ్యులు ప్రజలు, అనేక మంది దైవ జనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకి అండగా నియోజకవర్గ వైసీపీ నేత ముదునూరి

**- బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్**

**ప్రత్తిపాడు, పెన్ పవర్ ఏప్రిల్ 03 :**మండలంలోని ఒమ్మంగి గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా ఇండ్లు దగ్ధమైన రెండు కుటుంబాలను ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. గ్రామానికి చెందిన మొగిలి కృష్ణ, మొగిలి పెద్ద సత్తిబాబులకు చెందిన రెండు తాటాకిల్లులు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధమయ్యాయి.ఈ రెండు కుటుంబాలు ఇంట్లో లేని సమయంలో సంఘటన జరగటంతో బాధితులకు నిలువ నీడతో పాటు కట్టుబట్టలుకు కరువయ్యారు. ఈ నేపథ్యంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆ రెండు కుటుంబాలకు 50 కేజల బియ్యంతో పాటు ఒక్కొక్కరికి 10,000 రూపాయల చొప్పున 20 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్న బాధిత కుటుంబాలను ఏ ప్రభుత్వ అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. బాధితులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి వారిని అన్ని విధాలగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిశెట్టి దొరబాబు, గంటా గంగబాబు, కోలా తాతబాబు, యాళ్ల ఏసుబాబు, ముదునూరి సీతారామరాజు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన వాగు గున్నబాబుకి సత్కారం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:** జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాగు గున్న బాబును మండల ఆర్యవైశ్య సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం గున్నబాబు మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాపై నమ్మకం ఉంచి మహాసభకు ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య సోదరులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వూర నానాజీ,మాటూరు సూరిబాబు, పులవర్తి శీను, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ సంఘీభావ చెక్కును బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03:**ఆలమూరు మండలంలోని నర్సిపూడి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ అకాల మరణం పొందిన యూటిఎఫ్ సభ్యులు గొంగడ ఆనందరావు కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు యూటీఎఫ్ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యుటిఎఫ్ మండల శాఖ పక్షాన రూ. 3 లక్షల చెక్కును ఏర్పాటు చేసారు.దీంతో యుటిఎఫ్ మండల శాఖ కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావును ఆహ్వానించి, ఆయన చేతుల మీదుగా గురువారం అదే ఉన్నత పాఠశాలలో ఓదార్పు సమావేశం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. ముందుగా మడికి గ్రామంలో రావిచెట్టు సెంటర్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమానికి యుటిఎఫ్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఇది సామాజిక స్పృహ కలిగి ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి యుటిఎఫ్ ఎనలేని సేవలు చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రజల విపత్కరపరిస్థితులలో సమాజానికి సేవ చేయడంలో ఎప్పుడూ ముందుంటుందని, యూటీఎఫ్ సంఘాన్ని, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఇందుకు ముఖ్య అతిథులుగా కూటమి సీనియర్ నేతలు ఈదల సత్తిబాబు, రాయుడు బాబ్జి, దున్నే స్వామి నాయుడు, ఉండమట్ల బాలాజీ, పవన్, తదితరులు హాజరై యుటిఎఫ్ సంఘ సభ్యులను అభినందించి, మరిన్ని సేవా కార్యక్రమాలు మీ సంఘం ద్వారా జరగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 బి అప్పాజీ,ఎంఈఓ 2 సుబ్బరాజు,యూటీఎఫ్ నేతలు వైవివి రమణ, పివివిజిఎస్ఎన్ మూర్తి, దాసరి నాగేశ్వరరావు, బొంతు లోకేష్, జ్యోతి బస్సు, బేతనీడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాసిరకం బియ్యం సరఫరా. ప్రజల మండిపాటు.

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 3** : మండపేట లో ఈ నెల సరఫరా చేసిన పి డీ ఎఫ్ బియ్యం నాసిరకం గా వుందని ప్రజలు ఆరోపించారు. మండపేట 11 వ వార్డు లో ఏప్రియల్ నెల లో సరఫరా చేసిన కోటా బియ్యం కడిగితేనే నూక మాదిరి తయారు అవుతుందని అక్కడి స్థానికులు ఆరోపించారు. ఆ వార్డు కు చెందిన చంద్రు సత్యనారాయణ ఆ బియ్యాన్ని కడిగి మీడియా కు చూపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన బియ్యం ఇచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ సారి కొత్త బియ్యం సరఫరా చేశారని నాణ్యత లేని బియ్యం పేదలకు సరఫరా చేశారని మండి పడుతున్నారు. బియ్యం సరఫరా వాహనం వద్దే అమ్ముకునే వారికి డబ్బులు వచ్చేస్తున్నాయని, పేదలు మధ్యతరగతి ప్రజలకు ఇదే అన్నం అని అవేదన వ్యక్తం చేశారు. బియ్యం నీటి లో కడిగిన వెంటనే నూక మాదిరి గా అవుతుంది. బియ్యం ముద్దగా ఉడుకుతుంది. దీంతో తినే అవకాశం లేకుండా పోతుందని చెబుతున్నారు. నాణ్యత పరిశించాల్సిన అధికారులు తీరు ను ప్రశ్నిస్తున్నారు. పేదల బియన్ని యదేచ్ఛగా బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న పట్టించుకోవడం లేదని విమర్శలు వున్నాయి. దీనిపై పౌర సరఫరాల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే నెల లో అయినా నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.



# పన్ను వసూళ్లు లో రికార్డు.

- జిల్లా లో మండపేట ఫస్ట్.
- రాష్ట్ర స్థాయి లో పదవ స్థానం.




**మండపేట. పెన్ పవర్. ఏప్రిల్ 3 :**ఆస్తి పన్ను వసూళ్లు లో మండపేట పురపాలక సంఘం కోనసీమ జిల్లా లో ప్రథమ స్థానం పొందింది. రాష్ట్ర స్థాయి లో పదవ స్థానం సాధించింది. మండపేట మునిసిపాలిటీ 76.73 శాతం పన్నులు వసూలు చేసింది. జిల్లాలో ముమ్మిడి వరం 75.42 శాతం తో రెండవ స్థానం, రామచంద్రపురం 64.46 శాతం తో మూడవ స్థానం, అమలాపురం 61.19 శాతం పన్నులు వసూలు చేసి నాల్గవ స్థానం లో నిలిచింది. పన్ను వసూళ్లు చేయడం లో మునిసిపల్ కమిషనర్ టివి రంగారావు, ఆర్ ఓ జె వీ ఎస్ శాస్త్రి ల కృషి నీ పలువురు అభినందించారు.

## ఘనంగా వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పిట్టా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 3:**అన్నదేవరపేట గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పిట్టా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు అభిమానులు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పిట్టా శ్రీనివాస్ అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మేణ్ణి బ్రదర్స్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మేణ్ణి సోమరాజు, మేణ్ణి గణేష్, మేణ్ణి సతీష్ కుమార్, మేణ్ణి శేషగిరి, మేణ్ణి సురేష్, కమిడి నరేష్, చల్లా వెంకట రాజారావు, అయినపర్తి రత్నబాబు తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## డ్వాక్రా గ్రూపులో జాయిన్ చేయండి

**జీలుగుమిల్లి పెన్ పవర్, ఏప్రిల్ 3** :డ్వాక్రా గ్రూపులో జాయిన్ చేయకుండా అడ్డుపడుతున్న వివో ఏ వీరలక్ష్మి పై చర్యలు తీసుకోవాలని లక్ష్మీపురం గ్రామానికి చెందిన లంకపల్లి దివ్య ఆవేదన వ్యక్తం చేస్తుంది. గురువారం ఆమె మాట్లాడుతూ లక్ష్మీపురం డ్వాక్రా గ్రూపులో జాయిన్ అవ్వకుండా గత నాలుగు సంవత్సరాల నుండి వీరలక్ష్మి అడ్డుపడుతోందని తెలిపారు. గతంలో ఏపీఎం రామారావుకి చెప్పిన గాని పట్టించుకోలేదని అన్నారు. నీవు ఏ అధికారి దగ్గరికి వెళ్లిన నాకు ఏమీ కాదు అని వీరలక్ష్మి బెదిరిస్తుందని అన్నారు. ఇకనైనా లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఖాళీగా ఉన్న డ్వాక్రా గ్రూపులలో జాయిన్ చేయాలని వేడుకుంటుంది .



# అందరి సమన్వయంతో నాటుసారా నిర్మూలన

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 03:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 ద్వారా అందరి సమన్వయంతో పల్లెల్లో నాటు సారా నిర్మూలన సాధ్యమవుతుందని అమలాపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ అమర్ బాబు అన్నారు. ఆలమూరు ఎక్సైజ్ డివిజన్ పరిధిలో మండలంలోని మడికి, చొప్పెల్లలలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు ఎక్సైజ్ సిఐ ఐ.డి.నాగేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్సైలు పి.రాంబాబులు, జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా నాటు సారా వలన కలిగే దుష్ప్రభావాలను వివరించారు. నాటు సారా అమ్మిన తయారుచేసిన రవాణా చేసిన చట్టప్రకారంగా నేరమన్నారు. నాటు సారా తయారీ, విక్రేతలపై పిడి యాక్ట్ ను కూడా ప్రయోగించబడుతుందని హెచ్చరించారు. అలాగే ఆయా ప్రదేశాల్లో నిర్మూలన పోస్టర్ను ఆవిష్కరించి, వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దంగేటి చంద్రకళ బాపనయ్య, ఉంగ్రాజుకు మౌనిక చిన్న, సెక్రటరీలు వెంకటరత్నం, వెంకటరెడ్డి, వీఆర్వోలు సత్యనారాయణ వెంకట్, సచివాలయ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమాన స్పద మృతి పట్ల న్యాయ విచారణ కోరుతూ ఎమ్మార్వో కు ఫిర్యాదు.



ఏలేశ్వరంలో శాంతియుత ర్యాలీ, మానవహారం చేపట్టిన మండల పాస్టర్స్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:** పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి పట్ల ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టాలని, దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏలేశ్వరం మండల తాసల్దార్ కు గురువారం మండల పాస్టర్స్ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం పాస్టర్ ఫెలోషిప్, సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చ్ మండల పాస్టర్స్ ల ఆధ్వర్యంలో పట్టణంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ తాసిల్దార్ కార్యాలయం మెయిన్ గేటు వద్ద నుండి బయలుదేరి బాలాజీ చౌక్ సెంటర్ కు చేరుకొని ధర్నా చేపట్టారు. అనంతరం భారీ మానవహారం మానవహారంగా ఏర్పడి పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతి పట్ల న్యాయవిర్చారణ త్వరితగతిన చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్స్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై చాలా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, జరిగిన ఘటనపై ప్రభుత్వం న్యాయవిచారణ చేపట్టాలన్నారు. ప్రవీణ్ పగడాల మృతిని రోజురోజుకు పలు రకాలుగా సామాజిక మాధ్యమాలలో చూపిస్తున్నారని, అలా చూపించడం వల్ల క్రైస్తవులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రవీణ్ పగడాల మృతి పై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ లూథరన్, పట్టణ మండల అధ్యక్షుడు కె. ప్రశాంత్ కుమార్, కె సుదర్శన్ డేవిడ్ రాజ్,వి. వత్సలరావు,బి.సుమలత,కె. రవికుమార్,ఎం.సుజాత,ఎం. త్రిమూర్తులు,కుంపట్ల పాల్ ప్రసాద్, జె. రాజు, కె .మోహన్ రావు, సి. ఆర్. పట్టణ మండల పాస్టర్స్ సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## రైతులు పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించాలి.



-గోకులం షెడ్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కిర్లంపూడి, పెన్ పవర్,ఏప్రిల్ 3:** రైతులు వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించాలని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల,తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం కిర్లంపూడి మండలం సోమరాయణంపేటలో రైతు కాళ్ల సత్య లోకేష్ నిర్మించిన గోకులం షెడ్డును జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం మినీ గోకులం షెడ్లు మంజూరుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. గత వైసీపీ పాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు.మినీ గోకులం షెడ్లు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద రాయితీ ఇస్తున్నామని అన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు.గ్రామాల్లో పశుపోషణ, కోళ్ళు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.ఇటీవల పశుసంవర్ధకశాఖ అధికారులు గోకులం ఎంపిక ప్రక్రియకు చర్యలు చేపట్టడంతో పశుపోషకుల్లో ఆనందం వ్యక్తమవుతోందని, నియోజకవర్గంలో వందల సంఖ్యలో రైతులు ముందుకు వస్తున్నారని ప్రభుత్వ నిధులను బట్టి రైతులకు గోకులం షెడ్లు మంజూరు అవుతాయని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జడ్పిటిసి తోట గాంధీ, చదరం చంటిబాబు, తూము కుమార్, పెనగంటి బాబ్జి, పీలా మహేశ్వరరావు, పాటంశెట్టి మురళీకృష్ణ, గుడాల రాంబాబు, కంచుమర్తి రాఘవ, అధిక సంఖ్యలో రైతులు కుటమి నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి నిమ్మల కృషి.. విద్యుత్ సమస్యలకు స్వస్తి: దేవళ్ల ప్రసాద్, రత్నరాజు

**జిన్నూరులో రూ. 6.5 లక్షల వ్యయంతో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు**

**పెనుమంట్ర, (పోడూరు), పెన్ పవర్ మార్చి 3:** ప్రజల అండదండలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాయంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులు చేపట్టిన %టాశీస్త్రఅర్అఎం% కృషివలుడుగా పనిచేయడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని, మంత్రి కృషితోనే సమస్యలకు స్వస్తి పలకనుందని డిసిసిబి మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ దాసరి రత్నరాజు అన్నారు. పోడూరు మండలం జిన్నూరు నరసరాజు నగర్ లో రు 6.5 లక్షలు వ్యయంతో 63 కె వీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవళ్ల ప్రసాద్, దాసరి రత్నరాజు, మాజీ సర్పంచి పాలవలస తులసిరావు తదితర టిడిపి నాయకులు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని తన కుటుంబం గా భావించి ఎవరికి ఏ కష్టం వచ్చినా క్షణాల్లో పరిష్కరించే నిస్వార్థ నాయకుడు, ప్రజా ప్రతినిధి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. తన, మన, వర్గ భేదం లేకుండా ప్రజా సమస్యల పోరాటంలో, పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ సంక్షేమ ఫలాలు అభివృద్ధి ఫలాలు అందించడంలో ఆయన ముందుండడం నేటితరం నాయకులకు ఆయన స్ఫూర్తి అన్నారు. జిన్నూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం శుభ పరిణామం అన్నారు. జిన్నూరు పరిసర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్తు అందించడం, విద్యుత్ సమస్యల నివారణకు, వేలాది రూపాయలు విలువ చేసే గృహప్రకరణాల సంరక్షణకు ఏర్పాటు అయ్యే విద్యుత్ ఉపకేంద్రం ఎంతో దోహదపడుతుందన్నారు. అందుకు జిన్నూరు పరిసర గ్రామాల ప్రజలు రుణపడి ఉంటారని, ఆయన చేసిన కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యలకల శ్రీనివాస్, జీకే, శంకు సుబ్రహ్మణ్యం, కే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

- సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి
- పగడాల కుటుంబానికి న్యాయం చేయాలి





**టి. నరసాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 3:** క్రైస్తవ సంఘాల, విశ్వాసుల ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో స్వర్గీయ ప్రవీణ్ పగడాల యొక్క విచారణ వేగవంతం కావాలని ఆకాంక్షిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మత ప్రబోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని అతని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని క్రైస్తవ సంఘాల నాయకులు, విశ్వాసులు శాంతియుత ర్యాలీ ప్రదర్శన నిర్వహించి. మండలకేంద్రమైన టి. నరసాపురం హైస్కూల్ వద్ద నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. అంబేద్కర్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్రార్థన లు చేశారు . అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ ర్యాలీ ప్రదర్శన ను ఉద్దేశించి పాస్టర్ లు బి.అనిల్ కుమార్, కె. నిరీక్షణరావు, పి.ఏసుపాదం, డి.సామ్యూల్ రాజు పలువురు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన మృతిపై క్రైస్తవులకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మృతికి కారణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలన్నారు. క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. సమాజ క్షేమం కోసం క్రైస్తవులు నిత్యం ప్రార్థిస్తున్నారని అటువంటి వారిపై దాడులు చెయ్యడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు బి. బెసలేలు, సిహెచ్ హెూషేయ, ఆర్ మోషే, బి. రమేష్, వై పాల్ చిన్నారావు, నవజీన్ పాల్, బి. కిషోర్, ప్రేమ్ కుమార్, ప్రసన్నకుమార్, శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ అభినందన సత్కారం

ఏఎస్ఐ క్రమశిక్షణకు మారుపేరు- ఎస్సై





**టీ నర్సాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 3:**
పదవి విరమణ పొందిన ఏఎస్ఐ జయ కుమార్ ను పోలీస్ సిబ్బంది, పాత్రికేయులుఘనంగాసన్మానించారు.పోలీస్ క్వార్టర్స్ సువిశాల ప్రాంగణంలో చూడమచ్చటైన చక్కని వాతావరణం లో బుధవారం పదవి విరమణ పొందిన జయకుమార్ సత్కార సభలో ఎస్సై జయ బాబు మాట్లాడుతూ
ఏఎస్ఐ జయకుమార్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. 1987లో పోలీస్ శాఖలో ఉద్యోగం పొందిన జయ కుమార్ అంకితభావంతో, నిబద్ధతతో పని చేశారన్నారు. డ్యూటీ విషయంలో ఎంతో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. తోటి ఉద్యోగస్తులతో ఎంతో అన్యోన్యంగా ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, అందరితో కలిసి మెలిసి ఉండేవారని, 38 సంవత్సరాల పాటు పోలీస్ శాఖ కు సేవలందించి, ఆరోగ్యంతో పదవీ విరమణ పొందడం ఆనందదాయకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## టేకు ప్లాంటేషన్ ని పరిశీలించిన పి సి సి ఎఫ్



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఏప్రిల్ 3:**టేకు ప్లాంటేషన్ పురోగతికి సిబ్బంది కృషి చేయాలని అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ చలపతిరావు సూచించారు. గురువారం దర్భ గూడెం టేక్ ప్లాంటేషన్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో వేసిన టేకు ప్లాంటేషన్ ని అభివృద్ధి చేసే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అటవీ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్యం చర్యలు తప్పవని తెలిపారు ఈయనతోపాటు ఏలూరు డి ఎఫ్ ఓ శుభం ,సబ్ డి ఎఫ్ ఓ వెంకటసుబ్బయ్య, జంగారెడ్డిగూడెం ఎఫ్ఆర్ఓ దుర్గా కుమార్ బాబు, డిఆర్ఓ ధర్మారావు, దర్భగూడెం ఎఫ్బి ఓ లలిత కుమారి, జీలుగుమిల్లి ఎఫ్ బి ఓ మారేషు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రాందీ షాపు తొలగించాలని మహిళల ధర్నా కి సిపిఎం పార్టీ మద్దతు



**అల్లవరం, పెన్ పవర్, ఏప్రిల్ 03:**డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.పి. గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట పేట మండలం మాచవరం ప్రధాన రహదారిని ఆనుకొని దళిత వాడల మధ్య ఏర్పాటు చేసిన బ్రాందీ షాపు(సత్యవైన్స్ ) ను తొలగించాలని అమలాపురం ఎక్సైజ్ సూపర్డెంట్ కార్యాలయం వద్ద మహిళలు ధర్నా ధర్నాకి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ తరపున మద్దతు తెలియజేశారు ఈ ధర్నాలో సిపిఎం పార్టీ మద్దత్తును తెలియజేస్తూ సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు పలుమార్లు అధికారులు వద్దకు వెళ్లిన స్పందన కరువైందని మాకు న్యాయం జరిగే వరకు కూడా పోరాటం ఆగదన్నారు.

## ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్ ఎస్సై నరసింహమూర్తి

**రాజవొమ్మంగి పెన్ పవర్ ఏప్రిల్ 3:**రాజవొమ్మంగి మండలం సూరంపాలెం అటవీ ప్రాంతంలో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు పేకాట రాయుళ్ల వద్ద నుంచి 18,680 నగదు 52 పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజవొమ్మంగి ఎస్సై, నరసింహమూర్తి మీడియాకు తెలిపారు రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లోని ఎవరైనా పేకాట కోడిపందాలు గుండాట చిత్తులాట వంటి జూద క్రీడలు ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వవలసిందిగా ఎస్సై అన్నారు

## దోపిడీకి ప్రయత్నించిన ముగ్గురు యువకుల అరెస్టు.



**అనపర్తి,పెన్ పవర్,ఏప్రిల్ 3** దోపిడీకి యత్నించిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు సీఐ వి. సుమంత్ తెలిపారు. గురువారం సిఐ సుమంత్ ఎస్సై శ్రీను నాయక్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించి వివరాలు తెలిపారు. అనపర్తి కరివేపాకు పేటకు చెందిన ఆకుల సురేష్ తిరుపతి ట్రైన్ ఎక్కు నిమిత్తం స్థానిక రైల్వే స్టేషన్ కు వచ్చే సమయంలో స్థానికంగా నివాసం ఉండే పిల్లి కార్తీక్, అతని స్నేహితులు అయినవిల్లి వినయ్, అంజి అనే ముగ్గురు యువకులు అతనిపై చేయి చేసుకుని జేబులోను ఫోను, 1500 రూపాయలు నగదు లాక్కున్నారు. అతని భార్య భయపడి కేకలు వేయగా అమె ని చంపేస్తామని చాకుతో బెదిరించారు. పిల్లి కార్తీక్ గతంలో కరివేపాకు పేటలోని ఒక వృద్ధురాలిపై దాడి చేసి బంగారు గాజులు అనుకుని రోల్డ్ గోల్డ్ దొంగలించిన కేసులో కూడా ముద్దాయి. ముగ్గురుని అదుపులో చూసుకుని అరెస్టు చేసి విచారం చేస్తున్నామని సీఐ తెలిపారు.

## అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

రాజవొమ్మంగి , ఎస్సై నరసింహమూర్తి

**రాజవొమ్మంగి పెన్ పవర్ ఏప్రిల్ 03:** రాజవొమ్మంగి, మండలం లబ్బర్తి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం తెలిసి మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి ఆ వ్యక్తి నుంచి బీర్లు ఆరు, క్లాసిక్ బ్లూ, రెండు, ఐకాన్,మూడు. రాయల్ స్టాగ్, మూడు, షార్ట్ 4 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

## నీటి ఎద్దడిని నివారించడానికే పశువులకు నీటి తొట్టెలు - జెడ్పిటిసి జ్యోతి







**రాజవొమ్మంగి పెన్ పవర్ ఏప్రిల్ 3:** వేసవిలో పశువులకు నీటి ఎద్దటి లేకుండా ప్రభుత్వం మండలంలోని ప్రతి గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని జడ్పిడిసి వడుగుల జ్యోతి అన్నారు. ఏపీఓ రెడ్డి బాబు ఆధ్వర్యంలో జడ్డంగిలో గ్రామ సర్పంచ్ కొంగరమురళీకృష్ణ, దూసర పాములో సర్పంచ్ సిహెచ్ శివ, చెరువు కొమ్ము పాలెం లో సర్పంచ్ నాగేశ్వరరావుఅధ్యక్షతన నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేశారు. ప్రభుత్వంఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ ద్వారా నిర్మిస్తున్న పశువుల నీటి తొట్టెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు గణజాల తాతారావు అన్నారు. అలానే మారేడుబాక, చికిలింత, వంచంగి గ్రామాలలో కార్యక్రమం చేయడం జరిగింది.నాయకులు కోపూరి రత్నం, సింగిరెడ్డి రవి, చిన్నమ్మలు, కూటమి నాయకులు,ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్ రాంబాబు , ఏపీవో రెడ్డి బాబు ,టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ముస్లింలకు న్యాయం చేయాలి ఏలూరు జిల్లా ముస్లిం నాయకుడు ఆజాద్



**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:3:**లోక్ సభలో బిల్లు ఆమోదం రాజ్యంగాన్ని ధిక్కరించడమే కేంద్రం ముస్లిం లకు న్యాయం చేయాలని మనవి. జిల్లా ముస్లిం మైనారిటి నాయకుడు అజాద్.

లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వం అనుకూలత చూపడం భారత రాజ్యాంగం ముస్లిం మైనార్టీలకు అందించిన హక్కులను కాల రాయడమే నని జిల్లా ముస్లిం మైనారిటీ నాయకుడు అజాద్ అన్నారు.గురువారం అర్ధరాత్రి లోక్ సభ లో బిల్లు పాస్ చేయడం ముస్లిం మైనార్టీలకు చీకటి రాత్రి అని అన్నారు.డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ముస్లిం మైనార్టీలకు మత పరమైన అందించిన హక్కులను హరించడం అని అన్నారు.ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లుకు ఓటు వేయడం ముస్లింలను చిన్న చూపు చూడటమే అని అజాద్ అన్నారు.రాజ్య సభ లో అయినా బిల్లు ను వ్యతిరేకించాలి అని అజాద్ కోరారు.పౌరుల హక్కులు కాపాడడం ప్రభుత్వాల బాధ్యత అని,కేంద్రం ఈ విధంగా చేయడం సమంజసం కాదని అన్నా రూ.కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు న్యాయం చేయాలని మనవి చేశారు.

## బెన్నబాబు కు రాష్ట్రీయ పరిషత్ పురస్కార్ బెస్ట్ డాక్టర్ అవార్డు

**అన్నవరం, పెన్ పవర్ ,ఏప్రియల్ 3 :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు పదిలం బెన్నబాబుకు రాష్ట్రీయ పరిషత్ పురస్కార్ బెస్ట్ డాక్టర్ అవార్డు దక్కింది. గత కొన్ని దశాబ్దాలుగా వైద్య రంగంలో అనేక సేవలు అందిస్తూ బేసిక్ మెడికల్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా మరియు రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య(ఫెడరేషన్) రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులుగా కొనసాగుతున్నారు. రాష్ట్ర సమాచార,ప్రచార శాఖ కార్యదర్శి గా,రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్ గా,సెయింట్ జాన్ అంబులెన్స్ లైఫ్ మెంబర్ గా ఉంటూ అన్నవరం పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు గాను ఢిల్లీ కి చెందిన వర్తీ వెల్నెస్ ఫౌండేషన్ వారు రాష్ట్రీయ పరిషత్ పురస్కార్ ద్వారా 2025 వ సంవత్సరమునకు గాను బెస్ట్ డాక్టర్ అవార్డును బెన్నబాబు కు అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత బెన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రీయ పరిషత్ పురస్కార్ ద్వారా బెస్ట్ డాక్టర్ అవార్డు దక్కడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.



## గాజువాక హౌస్ కమిటీ భాదితులకు ఊరట

**గాజువాక : పెన్ పవర్ , ఏప్రిల్ 04** ప్రభుత్వ స్థలాలలో ఇల్లు నిర్మించుకున్న పేద మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.

40 ఏళ్లగా ఇల్లు నిర్మించుకొని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న గాజువాక ప్రజలకి గతంలో తెలుగుదేశం పార్టీ 301 జీవోని రిలీజ్ చేసి హౌస్ కమిటీ సమస్యకి చెక్క్ పెట్టిందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు

పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి ఆధ్వర్యంలో జీవో నెంబర్ 45 పై ప్రజలకు అవగాహన కల్పించడానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు..

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ మయాంక్ అశోక్ , జిల్లా రెవిన్యూ డివిజన్ ఆఫీసర్ శ్రీలేఖ పాల్గొన్నారు

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్



మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటూ ప్రభుత్వ స్థలాలలో ఇల్లు నిర్మించుకొని ఇప్పటివరకు పట్టాలు లేకుండా ఇబ్బంది పడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పిందని జీవో నంబర్ 45 ద్వారా 100 గజాల లోపున్న నిర్మాణాలకు ఉచితంగా పట్టాలు మంజూరు చేస్తామని అలాగే 100కు పైగా 1000 గజాలు మధ్యలో ఉన్నటువంటి నిర్మాణాలకు రెగ్యులైజేషన్ ఫీజులు చెల్లించి పట్టాలు పొందవచ్చు అని జిల్లా జాయింట్ కలెక్టర్ మయాంక్ అశోక్ తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోన తాతారావు కర్నంరెడ్డి నరసింగరావు, పల్లా చిరంజీవి శ్రీను, గోమాడ వాసు, ప్రసాద్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కలప బహిరంగ విక్రయం ..

**కురుపాం / పార్వతీపురం,పెన్ పవర్, ఏప్రిల్ 3 :** పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు ప్రభుత్వ వెదురు విక్రయ డిపోలో 2025-26 సంవత్సరానికి గాను టేకు, నాన్ టేకు కలప, వెదురు అమ్మకానికి సిద్దంగా ఉన్నాయని జిల్లా అటవీ శాఖ అధికారి జీ.ఏ.పి.ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట, రెండవ వేలం ప్రతిపాదించిన తేదిలలో కలప విక్రయించడం జరుగుతుందన్నారు. కలప, వెదురు మొదటి వేలాన్ని

ఏప్రిల్, మే, జూన్, జూలై, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబరు, వచ్చే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 9వ తేదీన, ఆగస్టు 11న, నవంబర్ 10వ తేదీన.,

:రెండవ వేలం ఏప్రిల్, మే, జూన్, నవంబర్, డిసెంబర్, వచ్చే ఫిబ్రవరి నెలల్లో 21వ తేదీన., జనవరిలో 22వ తేదీన, మార్చిలో 20వ తేదీన కలప, వెదురును సాలూరు ప్రభుత్వ కలప సేల్ డిపోలో విక్రయించడ%శీ% జరుగుతుందని అన్నారు. వేలం పాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

## గృహ నిర్మాణ సంస్థ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్..



**కురుపాం / పార్వతీపురం,పెన్ పవర్, ఏప్రిల్ 3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రూపొందించిన 2025 సం. డైరీని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహాలను త్వరితగతిన పూర్తి చేసే గురుతర బాధ్యత ఇంజినీర్లపై ఉందన్నారు. చిత్తశుద్ధితో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్ మరియు గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు పి.ధర్మచంద్రారెడ్డి, హౌసింగ్ డీఈఈలు,ఏఈఈలు,ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లు రద్దు చేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలి...

- సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్
- పార్వతీపురంలో గోడపత్రిక ఆవిష్కరణ ..




**కురుపాం /పార్వతీపురం, పెన్ పవర్, ఏప్రిల్ -3:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్ల పై ప్రజలంతా పోరాడాలని సిపిఎం పార్వతీపురం పట్టణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలనే గోడపత్రికలను గురువారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బి.వి.రమణ, పట్టణ కార్యదర్శి గొర్లి.వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని చెప్పి ప్రజలను నమ్మించి నేడు అధికారం వచ్చాక బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు పెంచివేసేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్న ప్రజలపై సెల్ ఫోను రీఛార్జ్ వలే స్మార్ట్ కరెంటు మీటర్లు ఇళ్లకు ఏర్పాటు చేసి మరింత ఆర్థిక భారాలు వేసే ప్రయత్నం చేపడుతుందని ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. కావున, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందాలను రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్, వెన్నెల చిన్నంనాయుడు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణం కోసం పందిరి ముహూర్తపురాట



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధిలో ఈ నెల 6న జరిగే సీతారాముల కల్యాణం కోసం పందిరి ముహూర్తపు రాట కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.శ్రీరామ నవమి సందర్భంగా ప్రతీ ఏటా నిర్వహించే సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించేందుకు స్థానిక ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.సంప్రదాయ బద్ధంగా ఊరేగింపు నిర్వహించి కళ్యాణం జరిపించనున్నారు. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గొర్లె వీరవెంకట్, గౌరవ అధ్యక్షురాలు,ఎంపీటీసీ రీమల రాజేశ్వరీ,సమరస్యత సేవా ఫౌండేషన్ జిల్లా సహాయ మహిళా కన్వీనర్ కొక్కుల లావణ్య,తెదేపా మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్, కమిటీ ప్రతినిధులు శోభన్, సురకత్తి రాము,నాడేల రాజారత్నం, బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాన్ అప్రూవల్ కోసం పాట్లు పడాల్సిందేనా ...?

- పార్వతీపురం మున్సిపాలిటీలో వింత పోకడ
- ఇంటి నిర్మాణ ప్లాన్ అప్రూవల్ కోసం నెలలుగా మున్సిపాలిటీ చుట్టూ తిరుగుతున్న బాధితులు..
- ఆథరైజ్డ్ నిర్మాణాల యజమానులకు గడ్డు కాలం
- అనాథరైజ్ నిర్మాణాలదే హవా..
- ప్రభుత్వ నిబంధనలు అమలు కావటం లేదన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు..



**కురుపాం / పార్వతీపురం:పెన్ పవర్, ఏప్రిల్ -3,** పార్వతీపురం మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ కోసం పాట్లు పడాల్సిందేనా ...? అని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, జిల్లా నాయకులు కోలాకిరణ్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పలుకుబడి ఉన్న వాళ్లకే త్వరగా ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ ఇచ్చే పరిస్థితి ఉందని ఆరోపించారు. పలుకుబడి లేని వారికి నెలలు కొద్ది తిప్పుతున్నారని ఆరోపించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన నిర్మాణం అనుమతులకు సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రవేశపెట్టనున్నట్లు గతంలో ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఆ ప్రభుత్వ నిబంధనలు పార్వతీపురం మున్సిపాలిటీలో కానరావడం లేదని ఆరోపించారు. ప్లాన్ ఎప్రూవల్ విషయమై పార్వతీపురం మున్సిపాలిటీలో వింతపోకడ నెలకొందన్నారు. పట్టణాల్లో 100 గజాల స్థలంలో నిర్మించిన నిర్మాణాలకు ప్లాన్ మినహాయింపు తో పాటు, 300 గజాల లోపు ఇంటి నిర్మాణాలకు సులభతరంగా ప్లాన్ మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, పార్వతీపురంలో అవేవీ అమలు కావటం లేదని ఆరోపించారు. 300 చదరపు మీటర్ల లోపు నిర్మాణాలకు స్వయంగా యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో సవరణలు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇంజనీర్లు, ఆర్కిటెక్టు, టౌన్ ప్లానర్లు సైతం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. దీంతోపాటు లైసెన్స్ టెక్నికల్ పర్సనల్ కూడా ఇంటి ప్లాన్ ను ధ్రువీకరించి అప్లోడ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో మాత్రం అవన్నీ చేసినప్పటికీ మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారన్నారు. కొంతమంది బాధితులు గత కొన్ని నెలలుగా ఇళ్ల నిర్మాణాల ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపాలిటీ చుట్టూ తిరుగుతూ ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో అన్ని పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం కింద భావన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ, పార్వతీపురంలో మాత్రం నిబంధనలు అమలు కావటం లేదన్నారు. భవన నిర్మాణ అనుమతులు జారీ అధికారాన్ని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల నుంచి పట్టణ స్థానిక సంస్థలకు ప్రభుత్వం బదిలీ చేసినట్లు ప్రకటన గుప్పించారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. పార్వతీపురం లో దాదాపు 40 నుండి 50 మంది వరకు ప్లాన్ అప్రూవల్ కోసం పడిగాపులు కాస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా ఆర్థరైజ్డ్ గా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తే వారికి ప్లాన్ అప్రూవల్ ప్రక్రియ గడ్డుకాలంగా మారిందన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో అనాథరైజ్ నిర్మాణాలే హాయ్ హాయిగా ఉన్నాయని అన్నారు. ఏమాత్రం ఇంటి ముందు ఇసుక, రాయి కనిపిస్తే గెద్దలా వాలిపోయే మున్సిపల్ సచివాలయ అధికారులు, సిబ్బంది ప్లాన్ అప్రూవల్ ను ఎందుకు త్వరితగతిన చేయడం లేదని ప్రశ్నించారు. పార్వతీపురం మున్సిపల్ అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న భవన నిర్మాణాల ప్లాన్ అప్రూవల్ ను తక్షణమే అప్రూవల్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వర్షాకాలం రాకముందే యజమానులు తమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆశతో ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు తీరుతో కొన్ని నెలలుగా ప్లాన్ అప్రూవల్ కోసం తిరుగుతున్నట్లు బాధితులు వాపోతున్నారన్నారు. పలుకుబడి ఉన్నవారికి ప్లాన్ అప్రూవల్ వేగవంతం అవుతున్నట్లు ఆరోపించారు. వైసిపి, కూటమి పాలకులు పుర పరిపాలనను గాలికి వదిలేసారని ఆరోపించారు. అందుకే అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మారాలని కోరారు. ఈ కార్యక్రమం తమ పార్టీ ఇన్చార్జి బత్తిన మోహన్ రావు ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు.

# భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వే...






**సరిహద్దు లోపాలను సవరించుకునేందుకు చక్కని అవకాశం**

**ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ**

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వేను పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని పార్వతీపురం ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. గురువారం

పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో రెండవ విడతలో జరిగిన రీసర్వే అవగాహన ర్యాలీ కార్యక్రమంలో పీఓ భాగస్వామ్యమై, రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతులకు ముందుగా నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చితమైన హద్దు లను నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. సర్వేలోని లోపాలు, ఇబ్బందు లను సవరించుకునేందుకు ఇది చక్కని అవకాశమని తెలిపారు. రీసర్వే గ్రామ సభకు హాజరై, రికార్డులను స్పష్టంగా సరిచూసుకోవాలని, అవసరమైన సవరణలు చేయాలని పీఓ సిబ్బందిని ఆదేశించారు.

ఈ ర్యాలీ కార్యక్రమంలో తహశీల్దార్, ఉప తహశీల్దార్, మండల సర్వేయర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

**తహసీల్దార్ టి.రామకృష్ణ**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్3:**ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్ లో నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పదకొండు అంకెల గుర్తింపు సంఖ్య వస్తుందని దానికి అనుగుణంగానే వ్యవసాయ అనుబంధ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు.గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు,వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్లతో, ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్ లో నమోదు చేసేందుకు వీఆర్వోలు,వ్యవసాయ సహాయకులు విధిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన ఆహారవంతమైన ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులు ద్వారా ఆహార పదార్థాలు పండించాలని సూచించారు.రీ సర్వే జరిగే గ్రామాలలో రైతులు విధిగా పాల్గొని సిబ్బందికి సహకరించాలని కోరారు. రైతులు మ్యుటేషన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ వంటి ఇన్పుట్ సబ్సిడీ పథకాలు పొందేందుకు అవకాశం ఉందని అన్నారు. దుకాణాల్లోనూ సంతల్లోనూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ ఉపయోగించకుండా నిషేధానికి అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదన్,ఆర్ ఐ మహదేవ్, మండల సర్వేయర్ శ్రీను,విఆర్వోలు,వ్యవసాయ సహాయకులు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది

- మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పుస్తక ఆవిష్కరణ




**ఎ.యు. పెన్ పవర్, ఏప్రిల్. 3 :**ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని రాజకీయ శాస్త్రం మరియు ప్రజా పరిపాలన విభాగంలో గురువారం డాక్టర్ విజయ్ చంద్ర రాసిన "రాజీవ్ గాంధీ జీవితం మరియు దర్శనికుడు అనే " పుస్తక ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా ప్రొఫెసర్ జార్జ్ విక్టర్ హాజరుయారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాల యం మాజీ వైస్ ఛాన్సలర్ మరియు ఎ.యు రాజకీయ శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రేమా నందం, కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజ కవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ప్రత్యేక అతిధులుగా పాల్గొన్నారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జీవితం మరియు దర్శనికతను గురించి తెలి యజేసారు . కాంగ్రెస్ పార్టీ మరియు గాంధీ కుటుంబం చేసిన అసంఖ్యాక త్యాగాలకు దేశం ఎప్పటికి రుణపడి ఉంటుందన్నారు, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ దేశం అనేక రంగాలలో అభివృద్ధి చెందిందని, ఐ.ఐ.టి, ఐ.ఐ. ఎం, ఏఐఎంఎస్, రంగాలను దేశంలో నెలకొల్పి న చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని. ఇరిగేషన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, హరిత విప్లవం, భూ సంస్కర ణలు,ఉపాధి హామి, పేదలకు ఇళ్లు, రైతులకు రుణమాఫీ, ఇలా అభివృద్ధి, సంక్షేమాన్ని ఒక తాటిపై నడిపించిన చరిత్ర కాంగ్రెస్ కి ఉందని, దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ ది ప్రియాంక అన్నారు.

# ద్విచక్ర వాహన ప్రమాదం వాహన చోదకుడు మృతి

**నిరుపేద కుటుంబం కావటంతో ఆర్థిక సహాయం చేసిన సీఐ వరప్రసాద్**





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం లకవరపుపేట పంచాయితీ కే. కోడిసింగి గ్రామానికి చెందిన కంకిపాటి భోగేశ్వరరావు(35) లకవరపుపేట నుంచి దేవరపల్లి వైపు మంగళవారం రాత్రి సుమారు 10:30 గంటలకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురి అయ్యి సంఘటన స్థలంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గూడెం కొత్తవీధి సిఐ వి వరప్రసాద్ హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఓవర్ స్పీడ్ కారణంగా అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. అయితే ప్రమాదంలో మృతి చెందిన బోదేశ్వరరావు కుటుంబం నిరుపేద కుటుంబం కావడం, అతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉండటంతో సీఐ వరప్రసాద్ మానవతా దృక్పథంతో పోస్ట్ మార్టం మరియు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం చేశారు.అలాగే సంఘటనా స్థలానికి విచ్చేసిన దేవరపల్లి సర్పంచ్ బుజ్జిబాబు, లకవర పేట సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్, స్థానిక ఉపాధ్యాయులు లోసెల రామకృష్ణ కూడ అంత్యక్రియల నిమిత్తం తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించారు.

# గురుకులం,ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులకు 2025 ఏప్రిల్ నుండి రెన్యువల్ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం

**పాడేరు,పెన్ పవర్ ఏప్రిల్ 03.**అల్లూరి జిల్లా ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేసి మూడునెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐ.టి.డీ.ఏ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం అందజేశారు.
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు ఐ.టీ.డీ.ఏ పరిధిలో 20 గురుకులం ఏకలవ్య పాఠశాల కళాశాలల్లో (ఎస్.ఆర్.ఆర్ టెండర్ సంస్థ) ద్వారా 60 మంది ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారని 2025 ఏప్రిల్ నుండి రెన్యువల్ చేసి కొనసాగించాలని గత మూడు నెలల నుండి జీతభత్యాలు అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బకాయి వేతనం తక్షణమే చెల్లించాలని నెలకు 7500 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని గురుకులం సొసైటీ రూల్ ప్రకారం 14 వేలు చెల్లించాలని పాఠశాల కళాశాల గేటు వద్ద కనీస సౌకర్యం లేక ఎండ వాన చలికి తీవ్ర ఇబ్బందులు గురై విధులు నిర్వర్తిస్తున్నారని కొన్ని పాఠశాల కళాశాలలో సెక్యూరిటీ గార్డుల చేత అదనపు పనులు చేయించడం వల్ల పని ఒత్తిడి గురవుతున్నారని ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డుల 2025 ఏప్రిల్ నుండి రెన్యువల్ చేయాలని మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని యూనిఫారం బూట్లు టార్చిలైట్ లాటి రక్షణ పరికరాలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంతి కుమారి,రాజేశ్వరి, ఈశ్వరమ్మ,కస్తూరి,సుభద్ర, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమాన

- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, ఏప్రిల్ 3** :కొత్తవలస పోలీసు స్టేషన్ పరిధిలో 2022 సం. లో నమోదైన హత్య కేసులో నిందితుడు కొత్తవ లస మండలం అప్పన్నదొర పాలెం పంచా యతీ జోడుమెరక గ్రామానికి చెందిన జోడి నాగరాజు (32 సం.లు)కు జీవిత ఖైదు, రూ.1000/- లు జరిమాన విధిస్తూ ఏప్రిల్ 3న డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ బి.కళ్యాణ్ చక్రవర్త తీర్పు వెల్లడిం చినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఏప్రిల్ 3న తెలిపారు.వివరాల్లోకి వెళ్లితే..కొత్తవలస మం డలం అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడిమె రక గ్రామానికి చెందిన జోడీ నాగరాజు తన భా ర్య లక్ష్మీ కనిపించడం లేదని 2022 సం.లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తవలస పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టార న్నారు. విచారణలో ఫిర్యాది,నిందితుడు అయి న జోడు నాగరాజు తన భార్య అయిన జోడు లక్ష్మీని హత్య చేసి, పెట్రోల్ పోసి కాల్చివేసి, తిరి గి తన భార్య అదృశ్యం అయినట్లుగా ఫిర్యాదు చేసినట్లుగా నిర్ధారణ అయ్యిందన్నారు. నింది తుడిని, అతడికి సహకరించిన మౌనిక ను అప్ప టి కొత్తవలస సి.ఐ బాలసూర్యారావు అరెస్టు చే సి రిమాండుకు తరలించి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు.ఈ కేసులో నింది తుడి పై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీ సులు సాక్షులను ప్రవేశ పెట్టడంతో (ఎ-1) జోడు నాగరాజు పై నేరారోపణలు రుజువు కాగా, ఎ-2 మౌనికపై నేరారోపణలు రుజువు కాలేదన్నారు. ఈ కేసులో పోలీసు వారి తరుపున పబ్లిక్ ప్రాసి క్యూటర్ శైలజ వాదనలు వినిపించారు. ప్రాసి క్యూషన్ సక్రమంగా జరిపించుటలో ప్రస్తుతం పని చేస్తున్న కొత్తవలస సిఐ సీహెచ్.షణ్ముఖ రావు ఆధ్వర్యంలో సి.ఎం.ఎస్,ఎస్.ఐ.పి.ఈ శ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ ఎర్నినాయుడు సాక్షులను సకాలంలో ప్రవేశ పెట్టారన్నారు.నిం దితుడికి శిక్ష పడడంలో క్రియాశీలకంగా పని చే సిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ అధి కారులను జిల్లా ఎస్పి వకుల్ జిందల్ అభినం దించారు.

## 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి



**కురుపాం / పార్వతీపురం,పెన్ పవర్, ఏప్రిల్ - 3 :**
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 5వ తేదీ శనివారం డా: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువార%శీ% ఒక ప్రకటన విడుదల చేసారు. శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక సౌందర్య థియేటర్ జంక్షన్ వద్ద ఉన్న డా.బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళు లర్పి%శీ%చడం జరుగుతుందని తెలిపారు. అనంతం 10 గంటలకు సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎస్ సి నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అత్యున్నత న్యాయస్థానాల తీర్పులు

- తుంగలో తొక్కేసిన బిజెపి ప్రభుత్వం
- బి.ఎస్.ఎన్.ఎల్.రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా




**విశాఖ దక్షిణం,పెన్ పవర్, ఏప్రిల్ 3** :బిఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ కార్యాల యం వద్ద బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు ధ ర్నా నిర్వహించారు, ఈ ధర్నా ముఖ్య ఉద్దేశం మార్చి 25 న లోక్సభలో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2025 - 26 ఫైనాన్స్ బిల్ ప్రవేశపె డుతూ 1972 సిసిఎస్ పెన్షన్ రూల్స్ మార్పు చేస్తూ భవిష్యత్తు పేరివిజన్లో పే కమిషన్ అమ లు జరిపిన నాటినుండి మాత్రమే రిటర్న్ ఉద్యో గులకు రివిజన్ ఉంటుందని లోక్సభ రాజ్యస భల్లో విలురూపణ తీసుకొచ్చారు దీనివల్ల దేశం లో కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు 65,000 మంది మరియు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగు ల 1,75,000 మంది పెన్షన్లు వ్యత్యాసాలు ఏర్ప డే పరిస్థితి ఏర్పడింది అత్యున్నత న్యాయస్థానా ల అనేక తీర్పులు ఇచ్చినప్పటికీ వాటన్నిటిని తుంగలో తొక్కి బిజెపి ప్రభుత్వం సామాన్య ప్ర జలపై మరి ముఖ్యంగా 30, 35 సంవత్సరాల సర్వీస్ చేసి దేశానికి వెన్నుదన్నుగా ఉన్నటువం టి సీనియర్ సిటిజన్స్ అయినా రిటైర్ ఉద్యోగు లు అందుకే ఇబ్బందులు గురికా పడుతున్నది కావున ఈ రోజు దేశవ్యాప్తంగా రిటైర్డ్ ఉద్యోగు లు ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు వెంటనే పార్లమెంట్లో ఆమోదించిన 25 26 ఫైనాన్స బి ల్లును రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉ ద్యోగులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కా ర్యదర్శి జి.ఎస్.జె.అచ్యుత రావు ధర్నాను ఉద్దే శించి ప్రసంగిస్తూ సీనియర్ సిటిజైనలు రిటైర్డ్ ఉద్యోగులందరూ దేశవ్యాప్త నిరసన తెలియజే స్తామని హెచ్చరించారు,
ఈ కార్యక్రమంలో కే సోమ సుందర్, బిఎస్ఎన్ ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి, ఎస్ ఎస్ వరప్రసాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎన్.పి.డబ్ల్యూ ఏ. పాల్గొన్నారు

# ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యం







- రసాయనలు ఉపయోగించి పండించు పంటల వల్ల అనార్థలు ఎక్కువ.
- జిల్లా వ్యవసాయ అధికారి సేవియర్ నందు.
- జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ భాస్కరరావు, ఏపీఎమ్ఐపి పిడి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 03.**ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య వంతమైన ఆహారోత్పత్తికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే శరణ్యమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సేవియర్ నందు, భాస్కరరావు, ఏపీఎమ్ఐపి పిడి తెలిపారు. మండల కేంద్రంలో గల వెలుగు సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ సంబంధిత అన్ని శాఖల అధికారులతో మండల పరిషత్ అధికారి, తహసిల్దార్ అధ్యక్షతన సమ్మేళనం గురువారం జరిగాయి. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుతం నెలకొన్న సామాజిక అంశాలను పరిశీలిస్తే ఎక్కడ చూసినా కాలుష్యం, కల్తీ దీనికి తోడు పంటలు పండించే రైతు అధిక దిగుబడులు తద్వారా ఆదాయం సాధించాలనే తపనలో రసాయనాలు ఉపయోగించి వ్యవసాయం చేయటం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయాని విస్తృత స్థాయిలో చేపట్టాలని గుర్తించమన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు 2028 నాటికి పాడేరు డివిజన్ లోని రైతులు అందరూ రసాయన ఎరువులు, రసాయన కీటక నాశక మందులు వాడని పంటలు పండించి నూరు శాతం ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా మండలంలోని వ్యవసాయ అనుబంధ శాఖలు కలసి ఈ నెల15 వ తేదీ నాటికి ప్రణాళిక సిద్ధం చేయుటకు సమాయత్త మవుతామన్నారు. ప్రజల ఆరోగ్యం, పోషణ దృష్టి లో ఉంచుకొని ఆరోగ్యకర పంటలు పండించే విధంగా కార్యాచరణ అమలు చేయాలని సంబంధించిన ఉద్యాన, పశుసంవర్ధక, ఉపాధిహామీ, వెలుగు సిబ్బంది, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కాఫీ బోర్డు, సూక్ష్మ నీటి పారుదల శాఖ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పంచాయతీల వారీగా వారి యాక్షన్ ప్లాన్ 15 నాటికి తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 32 విత్తనాలు తొలకరి వర్షాలు కురిసే ముందు చెల్లించేందుకు అవి ఎలా తయారు చేయాలో చేసి జిల్లా అధికారులు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ డిఈ, వెలుగు ఏపీఎం,ఎన్ఆర్జీఈఎస్ ఏపీఓ సంగంనాయుడు, ఎపిసిఎన్ఎఫ్ మండల ఇంచార్జి, వెలుగు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, కాఫీ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం.

ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి..

**కురుపాం / కొమరాడ, పెన్ పవర్, ఏప్రిల్ -3:**అన్ని రంగాల్లో అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు .గురువారం కొమరాడ మండలం లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలుకు ప్రారంబోత్సవాలు , శంకుస్థాపనలను ఆమె చేపట్టారు. గుణద తీలేసు పంచాయతీ గుణద నుండి భిన్నిడి వరకు 1 కోటి 95లక్షలు తో నిర్మాణం చేసిన బిటి రహదారి, ఎగువ గుణద నుండి సవరగుణద వరకు 1 కోటి 20 లక్షలు తో నిర్మాణం చేసిన బిటి రహదారి ప్రారంభించారు. అలాగే ఉలిపిరి పంచాయతీఉలిపిరి వలస లో. 12లక్షలు తో నిర్మాణం చేసిన స్కూల్ ప్రహరీ గోడ ప్రారంభించి, ఉలిపిరి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల కు 20 లక్షలు తో ప్రహరీ గోడ నిర్మాణం కు శంకుస్థాపన చేశారు. గుణానాపురం గ్రామం లో 14 లక్షలు తో నిర్మాణం చేసిన సీసీ రహదారి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాలు,అభివృద్ధికి,ప్ర భుత్వం చిత్తశుద్ధి తో పనిచేస్తుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు శేఖర్ పాత్రుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమలులోకురుపాం ఏ.ఎం. సి చైర్మెన్ కద్రక కళావతి, జనసేన కురుపాం ఇంచార్జ్ కద్రక మల్లేష్, టీడీపీ నాయకులు పొట్నూరు వెంకట నాయుడు, దేవకోట వెంకట నాయుడు, వాప్పంగి రాఘవేంద్ర, బిడ్డీక తమ్మయ్య, అధికారి సంతోషి, ముప్పానరాము, రౌతు పా పినాయుడు, హిమరక బలరాం, జనసేన నాయకులు శ్రీకర్, ఉపేంద్ర, గౌరీ శంకర్ అనంత్, బీజేపీ నాయకులు శ్రీస్టు శివన్నారాయణ, సురేష్, పలువురు కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సమష్టి కృషితో జిల్లా వైద్యారోగ్యశాఖ కు గుర్తింపు తీసుకురావాలి

:డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు






**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, ఏప్రిల్ - 3:**
అంకిత భావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు కార్యాలయ సిబ్బందికి సూచించారు.ఆరోగ్య కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు,సిబ్బందికి గురువారం సమావేశం నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లాలో చేపడుతున్న ప్రతీ కార్యక్రమానికి సంబంధించిన ప్రగతి నివేదికలను ఎప్పటికపుడు సిద్ధం చేసి సకాలంలో అందజేయాలన్నారు. తద్వారా వెనుకంజలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను గుర్తించి అందుకు గల కారణాలపై విశ్లేషణ జరిపి పని తీరును మెరుగు పర్చవచ్చని తెలిపారు.అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును తీరును పర్యవేక్షించాలన్నారు.ఈ క్రమంలో మాతా,శిశు వైద్య సేవలు,టీకా నిర్వహణ,అసంక్రామిక వ్యాధుల సర్వే(ఎన్సీడి),టిబి,లెప్రసీ,స్కూల్ హెల్త్,స్వచ్ఛ ఆంధ్ర తదితర ఆరోగ్య కార్యక్రమాలు జిల్లాలో పకడ్బందీగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేసి,సంబంధిత పోర్టల్స్,యాప్ ల నమోదు తీరును పరిశీలించాలని ప్రోగ్రాం అధికారులు,సిబ్బందికి సూచించారు.ఎక్కడైనా వ్యాధులు గుర్తిస్తే ఎపిడెమిక్ సెల్ అక్కడ వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఉండాలన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ మెరుగైన పనితీరు కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డా ఎం. నారాయణరావు,జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు,డా పిఎల్. రఘుకుమార్,డా ఎం.వినోద్ కుమార్,సూపరింటెండెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ లో ఎంత మార్పో...



**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్.రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు.వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట.

**ఈ మార్పు సరిపోదు జగనూ..**

జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్పిపుడు అసలైన పొలిటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

## సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

**రాజమండ్రి, ఏప్రిల్ 3, పెన్ పవర్:** నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీపుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళ్లు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు.ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు.చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా?హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు?ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. అలా కొన్నిగంటల సేపు మాత్రమే బుకాయించ గలిగారు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. అదే నిజమని తేలితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## సినిమాల్లోకి దువ్వాడ...

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4, పెన్ పవర్:** దువ్వాడ శ్రీనివాస్–మాధురి.. ఏ తెలుగు న్యూస్ ఛానెల్ చూసినా, యూట్యూబ్ ఛానెల్ చూసినా వీరిద్దరి సందడి అంతా ఇంతా కాదు. మాధురి ఎపిసోడ్ కి టాప్ రేటింగ్స్ రావడంతో అప్పట్నుంచి ఆమెను మీడియా నీడలా అనుసరిస్తోంది. మాధురిని ఆకాశానికెత్తేయడం, ఆమెను హీరోయిన్ లా ఉన్నారని అనడం, అందులోనూ నగ్మాతో పోల్చడం.. ఆమెతో క్యాట్ వాక్ చేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ చేయించడం.. అబ్బో ఇలాంటి సీన్స్ ఇంటర్వ్యూల్లో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా ఎంట్రీ విషయంపై మరోసారి క్లారిటీ ఇచ్చారు మాధురి.మాధురికి చాలా క్వాలిఫికేషన్లు ఉన్నాయని పొలిటీషియన్, వుమన్ ఎంటర్ ప్రెన్యూర్, ఇన్ ఫ్లూయెన్సర్, ఫైర్ బ్రాండ్.. ఇలా చాలా ఉన్నాయని, సినిమా హీరోయిన్ కూడా అందులో యాడ్ అవుతోందని యాంకర్ ఆమెను పొగడ్తల్లో ముంచెత్తారు. మాధురి కూడా తనకు చిన్నప్పటినుంచి యాక్టింగ్ అంటే ఆసక్తి ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాదు, గతంలో తనకు టైమ్ దొరకలేదని, ఛాన్స్ దొరకలేదని.. టైమ్ వచ్చినప్పుడు అది కూడా జరుగుతుందని చెప్పుకొచ్చారు మాధురి.మాధురి తనకు సినిమాల్లోకి వెళ్లాలనుంది అని అనగానే, పక్కనే ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ఊరుకుంటారా..? ఆయన కూడా మాధురి టాలెంట్ ని బయటపెట్టారు. పాటలు పాడటం కంటే కంటే ఆమె డ్యాన్స్ బాగా చేస్తుందని చెప్పుకొచ్చారు. భరతనాట్యంలో ఆమెకు ప్రవేశం ఉందన్నారు. నెమలికి నేర్పిన నడకలివీ అనే పాటతోపాటు, చాలా పాటలకు ఆమె అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుందన్నారు. గతంలో దువ్వాడ కూడా మాధురిని అడిగి మరీ కొన్ని పాటలకు డ్యాన్స్ వేయించుకునేవారట.దువ్వాడ శ్రీనివాస్ తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే ఇష్టమని, ఆయనే తనకు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆయన సినిమాల్ని తాను చూస్తుంటానని, హోమ్ థియేటర్లో ఆయన సినిమాలు చూస్తానన్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు తాను థియేటర్లకు వెళ్తుంటానన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ని కూడా తాను అభిమానిస్తానని, అయితే తాను సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్ అని చెప్పుకొచ్చారు దువ్వాడ. కార్ లో సీనియర్ ఎన్టీఆర్ పాటలు పెట్టుకుంటారని, అప్పుడప్పుడు ఆ పాటలకు అర్థాలు తనకు చెబుతుంటారని కోరస్ ఇచ్చారు మాధురి.శ్రీనివాస్ కి కూడా సినిమాలంటే బాగా ఇష్టం. ఆమధ్య మాధురి నిర్మాతగా ఆయన ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించినట్టు వార్తలొచ్చాయి. నటించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ఇక మాధురి కూడా తన యాక్టింగ్ పెర్ఫామెన్స్ ని వెండితెరపై చూపించాలనుకుంటున్నారు. ఫైనల్ గా వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా నటించే అవకాశం ఉందేమోనని అనిపిస్తోంది. దువ్వాడ–మాధురి కాంబినేషన్ ఇప్పటికే బుల్లితెరపై, యూట్యూబ్ లో సూపర్ హిట్ అయింది. వీరి ప్రోగ్రామ్ లకు మంచి ప్రేక్షకాదరణ ఉంది. ఇక వీరు సినీరంగంలోకి వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. షార్ట్ ఫిల్మ్ ల వరకు ఓకే, వెండితెరపై కనపడాలంటే అది కాస్త ఖర్చుతో కూడుకున్న పని, దానికి దువ్వాడ సిద్ధపడతారా..? మాధురి తెరంగేట్రానికి తానే నిర్మాత అవుతారా..? వేచి చూడాలి.

# విజయనగరంలో వైసీపీ ఖాళీ...?

**విజయనగరం, ఏప్రిల్ 3, పెన్ పవర్:** ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ మరింత పుంజుకుంటోందా? అంటే అవుననే తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలోపు వైసీపీ పూర్తిగా ఖాళీ కాబోతుందా? అంటే కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది.కురుపాం నుంచి ఎస్ కోట నియోజకవర్గం వరకూ ఎక్కడ చూసినా రాజకీయ వలసలు షరా మాములుగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డానికి కష్టించి పని చేసిన హార్డ్ కోర్ ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ కూడా ఇప్పుడు సైకిల్ బెల్లు కొట్టడానికి రెడీ అంటే రెడీ అంటున్నారట.ఒక్కో ఏరియాలో ఫలానా కావాలన్న షరతులు పెట్టకుండానే ఫ్యాన్ వదిలి సైకిలెక్కుతున్నారట. దీనంతటికీ కారణమేంటని చూస్తే.. అందరి నుంచి దాదాపు ఒకటే మాట వినిపిస్తోందట. ఇన్నాళ్ల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పార్టీని అధికారంలోకి తెస్తే.. తమకు మిగిలింది ఏదీ లేదని వీరంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఆ మాటకొస్తే ఫ్యాను రెక్కలు ముక్కలయ్యాయి.. మీ కంటికి కనిపించడం లేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారట. ఇన్నాళ్ల పాటు జగన్ని నమ్ముకున్నందుకు తాము నట్టేట మునిగామనీ అంటున్నారట. ఆ పార్టీలాగే తమ జీవితాలు కూడా అలాగే ఛిన్నాభిన్నమై పోయిందనీ వీరంతా గుర్రుగా ఉన్నారట. దీంతో టీడీపీ, జనసేనకు జై కొడుతున్నారట.మరీ ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాల్టీల్లో అయితే అవిశ్వాసానికి సైతం సిద్ధమయ్యారంటే ఫ్యాను పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే ఒక తిరుగుబాటు మొదలైందట. అవిశ్వాస తీర్మానం పెట్టడమే ఆలస్యమట.స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఫోన్ చేసి బుజ్జగించినా కుదరదని తెగేసి చెబుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. గతంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరాలంటే ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులతో రాయబారం నడిపించాలి. అదే ఇప్పుడు ఇందుకు రివర్స్ లో ఉందట వ్యవహారం. ఎవరూ ఏమీ అడక్కుండానే.. మేమే వచ్చేస్తున్నాం.. వద్దనకండి ప్లీజ్ అంటూ సైకిల్ బెల్ వారంతటే వారే మోగిస్తున్నారట. చోటా మోటా నాయక గణం తమంత తాముగా వెళ్లి.. కూటమి పార్టీల కండువాలు కప్పేసుకుంటున్నారట.ఇక నెల్లిమర్ల నియోజకవర్గంలో అయితే వైసీపీని ఎప్పుడు ఖాళీ చేద్దామా? అన్నట్టుందట ఇక్కడి జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి జోరు. వారానికి కనీసం రెండు మూడు గ్రామాల వైసీపీ కార్యకర్తలను తమ గ్లాసు పార్టీలో చేర్పించందే నిద్రపోవడం లేదట ఎమ్మెల్యే మాధవి. భవిష్యత్తులో తమకు పదవులు వచ్చినా రాకపోయినా.. వైసీపీ అనేది ఉండకూడదు. ఎటు నుంచి ఎటు చూసినా జనసేన మాత్రమే కనిపించాలన్నంత కసితో పని చేస్తున్నారట ఈ మహిళా ఎమ్మెల్యే.అయితే జిల్లా కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా ఉందంటున్నారు. కోరి వస్తామన్నా చేద్దాం– చూద్దాం అంటూ దాట వేస్తున్నారట ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు. వైసీపీలో అవినీతి మరక అంటని వారిని మాత్రమే తీసుకుంటున్నారట. ఇప్పటికే వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వస్తామనీ.. కార్పొరేషన్ను టీడీపీ పరం చేస్తామని బంపరాఫర్లు ప్రకటిస్తున్నా.. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వద్దంటే వద్దంటున్నారట. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎవరికి అధికారం ఇస్తే.. వారే పరిపాలించాలని హితబోధ చేస్తున్నారట. అందులోనూ ఎవరిని పడితే వారిని పార్టీలోకి తీసుకుంటే నష్టం తమకేనని.. వారిస్తున్నారట. దీంతో తండ్రి మాట జవదాటలేక మున్సిపల్ ఎన్నికలు వచ్చే వరకూ వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారటు ఎమ్మెల్యే.ఇక ఎస్ కోట, చీపురుపల్లి, సాలూరు, గజపతినగరం, కురుపాం నియోజకవర్గాలలో చేరికల పరంపర ఒక రేంజిలో కొనసాగుతోందట. రోజుకో నియోజకవర్గంలో భారీ స్థాయిలో చేరికలు కనిపిస్తున్నాయట. గ్రామాలకు గ్రామాలు సైకిల్ కి సై అంటున్నాయట. దీంతో వైసీపీ లీడర్లు బయటకు రావడానికే తటపటాయించాల్సి వస్తోందట. పార్టీ ఖాళీ అవుతుంటే ఇటు చూస్తూ ఊరుకోలేక, అటు అధినేతకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారట. ఏది ఏమైనా.. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు వచ్చే నాటికి ఈ ప్రాంతాల్లో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయట.

## బొత్సపై జనసేన ప్రత్యేక దృష్టి



**విజయవాడ, ఏప్రిల్ 2 పెన్ పవర్:** : ఏపీలో ( రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఆ పార్టీకి కీలక నేతలు గుడ్ బై చెబుతూ వచ్చారు. పార్టీలో నెంబర్ 2 స్థాయి కలిగిన నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. గత ఐదేళ్లపాటు పదవులతో పాటు ఆ పార్టీలో గౌరవం పొందిన నేతలు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యులతో పాటు ఎమ్మెల్సీలు సైతం పదవులను వదులుకున్నారు. విజయసాయిరెడ్డి లాంటి నేత వైసిపికి గుడ్ బై చెప్పడం ఆందోళన కలిగించే అంశమే. అయితే ఇప్పుడు తాజాగా బొత్స సత్యనారాయణ పై సైతం అనుమానపు చూపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.వాస్తవానికి బొత్స సత్యనారాయణ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అందుకు అనుగుణంగా బొత్స పవన్ కళ్యాణ్ ను ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భిన్నంగా బొత్స వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణాల్లో ఎదురుపడినప్పుడు ఆప్యాయ పలకరింతలు, ఆ లింగనాలు చేసుకుంటున్నారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ సైతం బొత్స విషయంలో పార్టీ శ్రేణులకు చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. బొత్సను పార్టీలోకి తెస్తే ఎలా ఉంటుంది అని పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించినట్లు సమాచారం. అయితే జనసేన నాయకుల నుంచి సానుకూలత రావడంతో పవన్ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. కొందరు అరెస్టులు కూడా అయ్యారు. కానీ బొత్స విషయంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేశారు బొత్స. కానీ ఎన్నడు రివేంజ్ రాజకీయాలు నడపలేదన్నది ఆయనపై ఉన్న మంచి ముద్ర. అందుకే కూటమి ప్రభుత్వంలో సైతం ఆయనకు సరైన గౌరవం దక్కుతోంది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ శాసనమండలిపక్ష నేతగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. పార్టీ తరఫున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. అటువంటి నేతను జనసేనలోకి తెచ్చుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీయవచ్చని పవన్ భావిస్తున్నారట. ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు బొత్స. విజయనగరం జిల్లాలో అయితే నాలుగు నియోజకవర్గాలు ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉంటాయి. మిగతా నియోజకవర్గంలో సైతం ప్రభావం చూపగలరు. ఉత్తరాంధ్రలో బలమైన తూర్పు కాపు సామాజిక వర్గంలో పట్టున్న నేత. అందుకే ఆయనను జనసేనలోకి రప్పించుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని పవన్ భావిస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# దేవాదాయశాఖలో ఇంటి దొంగలు

**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** విజయవాడలో దేవాదాయ శాఖ భూములతో బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన వెలుగు చూసింది. నగరం నడిబొడ్డున ఉన్న దాదాపు ఆరెకరాల భూమి అన్యాక్రాంతమైనా? దేవాదాయ శాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇవే భూములకు నకిలీ పత్రాలను సృష్టించి వందల కోట్లకు బ్యాంకుల్ని మోసం చేశారు. దేవాదాయ శాఖకు దానపత్రం రాసిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టకపోవడం వెనుక దేవాదాయ శాఖ బాధ్యతలు చూసిన మాజీ మంత్రి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.విజయవాడ పటమటలో ఉన్న గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములు ఉన్నాయి. భూముల్ని దానం ఇచ్చిన దాతల కుటుంబానికి చెందిన మూడో తరం వారసులు భూముల విలువ పెరగడంతో అవి కుటుంబ ఆస్తులంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. ఆ భూముల్ని అమ్ముకోడానికి అనుమతివ్వాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో భూములను దానం ఇచ్చిన సమయంలోనే వాటిని ధర్మకార్యక్రమాలలో దేనికి వినియోగించాలో స్పష్టం చేస్తూ రాసిన దాన పత్రం వెలుగు చూసింది. నగరం మధ్యలో ఉన్న వందల కోట్ల ఖరీదు చేసే ఈ భూమిని కాజేయడానికి కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో దేవాదాయ శాఖకు సారథ్యం వహించిన మంత్రి అండతో భూముల్ని అమ్మేసే స్కెచ్ వేశారు. అంతకు ముందే ఇవే భూములపై ఓ జాతీయ బ్యాంకులో రుణాన్ని కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో 2023లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ భూముల వ్యవహారంపై 2023లో మచిలీపట్నం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో బి.సుబ్బారావు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక వెలుగు చూసింది.పబ్లిక్ ట్రస్ట్‌కు సంబంధించిన భూమిని ప్రైవేట్ ట్రస్టుగా భావిస్తూ ట్రస్టీ ఎప్పుడూ భూమికి యజమాని కాలేదని గతంలో సుప్రీం కోర్టు, హైకోర్టులు స్పష్టం చేశాయని, ఆ తీర్పులకు విరుద్దంగా కింది కోర్టులు ఇచ్చిన డిక్రీలను అడ్డం పెట్టుకుని భూముల్ని అమ్మే ప్రయత్నాలు చేయడంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ట్రస్టు నిర్వహిస్తోన్న ట్రస్టీ దేవాదాయ చట్టం సెక్షన్ 30/87 ప్రకారం ఆస్తులను కాపాడలేకపోవడంతో చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ట్రస్ట్ కార్యక్రమాల నుంచి తొలగించి వేరేవారిని నియమించడంతో పాటు ట్రస్ట్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేశారు.విజయవాడ నగరంలో ఉన్న దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంపై హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విజయవాడ కనకదుర్గ దేవస్థానం భూముల్ని 50 ఏళ్లకు లీజుకిచ్చే అంశం వెలుగు చూసింది. ఈ క్రమంలోనే విజయవాడలో వందల కోట్ల దేవాదాయ శాఖ ఆస్తులు పరాధీనమైన వైనం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దేవాదాయ భూములను కాపాడాలని పోరాడుతున్న వారు వీటిని వెలుగులోకి తెస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో ఖరీదైన భూముల వ్యవహారంలో ఉదాసీనత బయటపడింది. సామాజిక, దైవిక కార్యక్రమాలకు చెందిన భూములను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే పటమటలో ఉన్న గోవిందరాజు ట్రస్టు ఈనాం భూముల్ని చూపి జాతీయ బ్యాంకులో రూ.100కోట్ల రుణం తీసుకోవడం గతంలోనే వెలుగులోకి వచ్చింది. ఏపీకి చెందిన జాతీయ బ్యాంకు మరో బ్యాంకులో విలీనమైన తర్వాత ఈ వ్యవహారం పూర్తిగా మరుగున పడిపోయింది. అసలు వడ్డీలతో కలిపి ఈ మోసం విలువ రూ.200కోట్లు వరకు ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి.గోవిందరాజు వంశానికి చెందిన వారు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన పటమటలోని సర్వే నెంబర్ 91/2లోని 5,92 ఎకరాల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. రిజిస్టర్డ్ డీడ్ ప్రకారం భూమిని జాగ్రత్తగా కాపాడాలని, ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని నాలుగు బాగాలు చేసి ధార్మిక కార్యక్రమాలకు వాడాలని, ఏ భాగం ఎందుకు వాడాలో కూడా దాన పత్రంలో స్పష్టం చేశారు.గోవింద రాజులు ట్రస్టుకు సంబంధించిన భూముల్ని లీజుకు తీసుకున్న వారి వారసుడు పదేళ్ల క్రితమే ఈ భూముల్ని తనఖా పెట్టి రూ.100కోట్ల రుణాన్ని తీసుకుని వాటిని చెల్లించలేదు.వడ్డీలతో కలిపి రుణమొత్తం భారీగా పెరిగింది. ఈ క్రమంలో గోవింద రాజు ట్రస్టును శ్రీ గోవింద రాజు ట్రస్టు పేరుతో దేవాదాయ శాఖను ప్రతివాదిగా చేర్చకుండా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనికి విజయవాడకు చెందిన ఓ పార్టీ ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ మంత్రి ఒకరు సహకరించినట్టు తెలుస్తోంది.అసలైన ట్రస్టీలు ఉన్న సమయంలోనే ఆ భూముల్లో కొంత భాగాన్ని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించడంతో అక్కడ దశాబ్దాలుగా హైస్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్ నిర్వహిస్తున్నభూమిని కార్పొరేషన్‌కు గతంలోనే రిజిస్ట్రేషన్ చేశారు. 5.90 ఎకరాల భూమి దేవాదాయ శాఖకు చెందినదేనని 2023లో నే విచారణాధికారి నివేదిక సమర్పించినా నాటి ప్రభుత్వం దానిని అమోదించకుండా తొక్కి పెట్టింది.భూమి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటే అసలు దొంగలు బయటపడతారు. దీంతో నివేదిక వెలుగు చూడకుండా విజయవాడకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ప్రజాప్రతినిధులు, అధికారులకు చిక్కులు తప్పవని హిందూ ధార్మిక సంఘాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు.

## వెస్టిండీస్, సౌతాఫ్రికాలతో సిరీస్.. 2025 టీమిండియా హోమ్ షెడ్యూల్, టైమింగ్ వివరాలు!





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా క్రికెట్ ఫ్యాన్స్ ప్రస్తుతం ఐపీఎల్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఐపీఎల్ తర్వాత 2025లో భారత క్రికెట్ జట్టు సొంతగడ్డపై ఆడబోయే క్రికెట్ షెడ్యూల్ వచ్చేసింది. బీసీసీఐ బుధవారం (ఏప్రిల్ 2) 2025-26 సీజన్ లో టీమిండియా స్వదేశంలో ఆడబోయే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లతో టీమిండియా స్వదేశంలో సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌తో ఇండియా హోమ్ సీజన్ ప్రారంభమవుతుంది.

వెస్టిండీస్ తో భారత్ రెండు టెస్టులు ఆడనుంది. అక్టోబర్ 2 నుంచి 6 వరకు తొలి టెస్ట్ మ్యాచ్.. అక్టోబర్ 10 నుంచి 14 వరకు రెండో టెస్ట్ జరుగుతుంది. తొలి టెస్టుకు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం ఆతిథ్యమిస్తుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో రెండో టెస్ట్ జరుగుతుంది. మ్యాచ్ భారత కాలమాన ప్రకారం ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతుంది.

విండీస్ తర్వాత నవంబర్- డిసెంబర్ నెలలో సౌతాఫ్రికా ఇండియాలో పర్యటిస్తుంది. మూడు ఫార్మాట్ లలో టీమిండియా.. సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ సుదీర్ఘ టూర్ లో సౌతాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. నవంబర్ 14 నుంచి 18 వరకు తొలి టెస్ట్ న్యూఢిల్లీ వేదికగా అరుణ్ జైట్లీ స్టేడియంలో.. నవంబర్ 22 నుంచి 26 వరకు గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో రెండో టెస్ట్ జరుగుతుంది. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిథ్యమిస్తాయి. డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు మొత్తం 5 టీ 20 మ్యాచ్ లు జరుగుతాయి. డిసెంబర్ 9 న కటక్ వేదికగా తొలి టీ20.. డిసెంబర్ 11 న్యూ చండీగఢ్ వేదికగా రెండో టీ20.. డిసెంబర్ 14 న ధర్మశాల వేదికగా మూడో టీ20.. డిసెంబర్ 17 న లక్నో వేదికగా నాలుగో టీ20.. డిసెంబర్ 19న అహ్మదాబాద్ లో ఐదో టీ20 జరుగుతాయి. వన్డే మ్యాచ్ లో మధ్యాహ్నం 1:30 నిమిషాలకు.. టీ20 మ్యాచ్ లు రాత్రి 7:00 గంటలకు ప్రారంభమవుతాయి.

## కోహ్లీకి గాయం.. ముంబైతో మ్యాచ్ ఆడతాడా.. RCB హెడ్ కోచ్ ఏమన్నాడంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ మాజీ కెప్టెన్.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయపడ్డాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం (ఏప్రిల్ 2) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో కోహ్లీ ఫీల్డింగ్ చేస్తుండగా గాయమైంది. టైటాన్స్ ఇన్నింగ్స్ 12వ ఓవర్లో ఈ సంఘటన జరిగింది. ఆర్సీబీ స్పిన్నర్ కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో సాయి సుదర్శన్ గట్టిగా స్వీప్ ఆడాడు. డీప్ మిడ్-వికెట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కోహ్లీ బంతిని ఆపడానికి పరిగెత్తే ప్రయత్నంలో అతని చేతి వేలికి గాయం అయింది. దీంతో గ్రౌండ్ లోనే నొప్పితో కోహ్లీ చేయి ఊపుతూ కనిపించాడు.కోహ్లీ గాయంపై అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే అభిమానులకు గుడ్ న్యూస్ చెబుతూ.. విరాట్ గాయంపై ఆర్సీబీ హెడ్ కోచ్ క్లారిటీ ఇచ్చాడు. కోహ్లీ ప్రస్తుతం బాగానే ఉన్నాడని.. అతని ఎలాంటి సమస్య లేదని చెప్పాడు. దీంతో కింగ్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. బెంగళూరు ఐపీఎల్ లో తమ తదుపరి మ్యాచ్ ను ఏప్రిల్ 7న ముంబై ఇండియన్స్ తో తలపడనుంది. ఈ మ్యాచ్ లో కోహ్లీ ఆడడం ఖాయమైంది. ఈ మ్యాచ్ లో కోహ్లీ 6 బంతుల్లో 7 పరుగులే చేసి ఔటయ్యాడు. స్వీర్ లెగ్‌లో షాట్‌కు యత్నించి యంగ్ బౌలర్ అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో వికెట్ సమర్పించుకున్నాడు.




ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. బుధవారం (ఏప్రిల్ 2) చిన్న స్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బౌలింగ్ లో సిరాజ్ నిప్పులు చెరగగా..ఆ తర్వాత ఛేజింగ్ లో బట్లర్( 39 బంతుల్లో 73:5 ఫోర్లు, 6 సిక్సర్లు) సాయి సుదర్శన్ (49) బ్యాటింగ్ లో అదరగొట్టారు. ఈ సీజన్ లో వరుసగా రెండు విజయాలు సాధించిన ఆర్సీబీ తొలి పరాజయాన్ని మూట కట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది.

## నేను వన్ ఆఫ్ ది బెస్ట్ స్పిన్నర్.. చెప్పిన మాట నిలబెట్టుకున్న యువ క్రికెటర్!





**హైదరాబాద్ పెన్ పవర్:** రవిశ్రీనివాసన్ సాయి కిషోర్.. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లో అదరగొడుతున్నాడు. ఆడిన మూడు మ్యాచ్ ల్లో 6 వికెట్లు పడగొట్టి ఐపీఎల్ 2025 సీజన్ ను గ్రాండ్ గా ఆరంభించాడు. బ్యాటింగ్ పిచ్ లపై రవి కిషోర్ బౌలింగ్ చేస్తున్న తీరు అద్భుతం. గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న ఈ 28 ఏళ్ళ స్పిన్నర్ మూడు మ్యాచ్ ల్లో కట్టుదిట్టమైన బౌలింగ్ లో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాడు. సహచరుడు రషీద్ ఖాన్ భారీగా పరుగులిస్తున్నా.. ఈ తమిళ నాడు స్పిన్నర్ మాత్రం తన వేరియేషన్ తో ఆకట్టుకుంటున్నాడు. బుధవారం (ఏప్రిల్ 2) రాయల్ ఛాలెంజర్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో 4 ఓవర్లలో 22 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ తర్వాత సాయి కిషోర్ చెప్పిన ఒక స్టేట్ మెంట్ వైరల్ అవుతుంది. 2024 దులీప్ ట్రోఫీకి ముందు సాయి కిషోర్.. సెలక్టర్లు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. “నేను దేశంలోని అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడినని భావిస్తున్నాను. నన్ను టెస్ట్ మ్యాచ్‌లకు సెలక్ట్ చేస్తే నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నేను ఎక్కువగా ఆందోళన చెందాల్సిన పని లేదు.” అని ఈ యువ క్రికెటర్ చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం బ్యాటింగ్ కు స్వర్గధామంగా ఉన్న పిచ్ లపై సాయి కిషోర్ బౌలింగ్ చేస్తున్న తీరు అద్భుతం. అతను గత సంవత్సరంలో ఇచ్చిన స్టేట్ మెంట్ కు న్యాయం చేశాడనిపిస్తుంది. గత సీజన్ లో కూడా గుజరాత్ జట్టుతోనే ఉన్న సాయి కిషోర్ 19.57 సగటుతో 5 మ్యాచ్‌లలో 7 వికెట్లు పడగొట్టి పర్వాలేదనిపించాడు. ఇదంతా పక్కన పెడితే టీమిండియాలో చోటు దక్కించుకోవడం అంత సామాన్యమైన విషయం కాదు. ముఖ్యంగా స్పిన్ విభాగంలో చాలా కష్టం. స్పిన్నర్లు ఎక్కువగా ఉండే మన దేశంలో ఎంతో అనుభవమున్న యుజ్వేంద్ర చాహల్ కు సైతం జట్టులో స్థానం దక్కడం లేదు. ఐపీఎల్ తర్వాత సాయి కిషోర్ ను సెలక్టర్లు ఏమైనా పరిగణిస్తారేమో చూడాలి.

## అద్భుతమైన లుక్స్



## జైలర్ -2! లో బాలయ్య వర్సెస్ సూర్య!





సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో - జైలర్ -2- పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చెన్నైలో షూటింగ్ జరుగుతోంది. అయితే ఇందులో ఎంత మంది స్టార్ హీరోలు నటిస్తున్నారు? అన్న దానిపై ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు.తొలి భాగంలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్ లాంటి స్టార్లు గెస్ట్ అప్పియిన్స్ తో అదొరగొట్టడంతో? - జైలర్ 2- లో అంతకు మించే ఉంటుంది తప్ప తగ్గదు అనే ప్రచారం తొలి నుంచి జరుగుతూనే ఉంది. టాలీవుడ్ నుంచి నటసింహ బాలకృష్ణ పవర్ ఫుల్ పాత్రలో రంగంలోకి దిగుతున్నారని ఇప్పటికే ప్రచారంలో ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్ కి ఏ మాత్రం తగ్గకుండా తెరపై కనిపించినంత సేపు విధ్వంసంలాగే పాత్ర నడుస్తుందని ప్రచారం జరిగింది. కంటున్యూటీగా మోహన్ లాల్, శివన్న పాత్రలు యధావిధిగా ఉంటాయని వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో సంచలన నటుడి పేరు తెరపైకి వస్తోంది. కోలీవుడ్ విలక్షణ నటుడు సూర్య కూడా ఇందులో ఓ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. నెల్సన్ సూర్యతో చర్చలు జరుపుతున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక సమాచారం వెలువడుతుందని వినిపిస్తుంది. నిజంగా సూర్య కూడా ఎంటర్ అయితే ప్రాజెక్ట్ నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. బాలయ్య ను పాజిటివ్ రోల్ లో లాంచ్ చేసి సూర్య కు పవర్ ఫుల్ నెగిటివ్ రోల్ అప్పగించి..వాళ్లిద్దరి మధ్యా మాటల యుద్ధం...భారీ యాక్షన్ సీన్ ప్లాన్ చేస్తే మామూలుగా ఉండదు. సూపర్ స్టార్ ఇమేజ్ సైతం కొట్టుకుపోయే పెర్ఫార్మెన్స్ తో అదర గొడతారు. ఆ సీన్స్ కు సూపర్ స్టార్ ఇమేజ్ టచ్ అప్ ఇస్తే నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. బాలయ్య కు కోలీవుడ్ లో కూడా మాస్ ఫీల్ దక్కుతుంది. మరి నెల్సన్ ఎలాంటి వ్యూహంతో ఉన్నాడో చూడాలి.



అనసూయ భరద్వాజ్ పూల చీర లుక్ తప్పక చూడాలి

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com